ANN తెలుగు

Follow: @ANNTELUGU

17-06-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 166   పేజీలు-08   వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM




## మహా ఎఫెక్ట్

### ఏపీఆర్ ప్రవీణ్స్ కు షాక్

**ఎఫ్ టి ఎల్ లో నిర్మించిన ప్రహరీని కూల్చిన అధికారులు**

**ప్రొక్లయినర్ తో ఆక్రమిత ప్రాంతం కూల్చిన అధికారులు**

**హైదరాబాద్, మహా:** ఏపీఆర్ ప్రవీణ్స్ బ్రాహ్మణపల్లి చెరువు వద్ద చేసిన ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు కన్నెర్రచేశారు. నోటీసు జారీచేయడంతో పాటు చెరువు ఎఫ్ టిఎల్ కు సంబంధించిన కొంత భాగంలో నిర్మించిన ప్రహరీని తొలగించి షాకిచ్చారు. ప్రొక్లయినర్ ద్వారా గోడలు కూల్చేశారు. ఆరోపణలున్న ఆక్రమిత ప్రాంతంలోని గోడను, కట్టడాన్ని ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి తొలగించారు. ఏపీఆర్ ప్రవీణ్స్ బరితెగింపు మహా పత్రికలో ఈనెల 8న కథనం ప్రచురితం కాగా, నోటీసు జారీచేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం ఇందుకు సంబంధించిన ప్రహరీని కూల్చేశారు. చెరువు ఎఫ్ టి ఎల్ ఉను ఆక్రమించి.. చేసిన అక్రమంపై మహాపత్రిక వెలుగులోకి తేగా, అధికారులు స్పందించడంతో ఆక్రమణలు కూలాయి. ఫలితంగా చెరువు ముంపు ఇళ్ళను ముంచకుండా అధికారులు సకాలంలో స్పందించినట్లయింది. ఇలాంటి ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించమని, భారీ వెంచర్లు నిర్మించే యాజమాన్యాలు చిన్నచిన్న తప్పులు చేసి ఇబ్బందిపడవద్దని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. ఎవరు ఇలాంటి తప్పిదాలకు పాల్పడ్డా.. ఊరుకునే ప్రసక్తేలేదని, వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డేగకళ్ళతో నిఘా వేశామని ఇరిగేషన్ అధికారులు మహాకు తెలిపారు.

టాప్ న్యూస్

### నేడు వరంగల్ కు పవన్ కల్యాణ్

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడికి పరామర్శ

02



### తమిళనాడు రైతులకు రుణ మాఫీ

- సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- రూ. 75 వేల వరకు ఉన్న రైతులకు మాఫీ
- 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి

03



### ట్రంప్ గౌరవార్థం రేవంత్ గిఫ్ట్

- జూన్ 23న డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ప్రారంభం
- గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో రోడ్డుకు పేరు

02



# 30 కోట్ల మోసం... కొనుగోలుదారుల్లో ఆందోళన

## 'శ్రీకారం' రియల్ దందాపై మహా కథనాలు

- నారాయణఖేడ్ లో ఫార్మ్ల్యాండ్ ముసుగులో కోట్ల వ్యాపారం
- అక్రమ లేఅవుట్లపై అధికారుల మౌనం
- రియల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్టేది?
- "ఆయుష్మాన్భవ్', 'ఐకానిక్ హౌసింగ్'
- వెంచర్ల అక్రమాలపై చర్యలకు రంగం సిద్ధం
- "శ్రీకారం రియల్ ఎస్టేట్ సంస్థ
- ఆర్థిక లావాదేవీలపై ఐటీ శాఖ నజర్
- "ఫార్మ్ల్యాండ్ వెంచర్లపై కలెక్టర్
- స్పందించాలంటున్న బాధితులు

02




నమ్మకమే పెట్టుబడిగా, అమాయక ప్రజల ఆశలే ఆసరాగా రియల్ ఎస్టేట్ రంగంలో కొందరు కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. 'శ్రీకారం రియల్ ఎస్టేట్' సంస్థ నారాయణ్ఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్ మండలం వాంగ్దల్ గ్రామ పరిదిలో 'ఆయుష్మాన్భవ్', మనూర్ మండలం దావూర్ గ్రామ పరిదిలో 'శ్రీకారం ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్' ఫార్మ్ల్యాండ్ వెంచర్ల పేరుతో చేస్తున్న వ్యాపారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. హెచ్ ఎమ్ డి ఏ, డీటీసీపీ అనుమతులు మచ్చుకైనా కనిపించవు. అయినా సరే, ఈ అక్రమ వెంచర్ల పేరిట సామాన్యులను బురిడీ కొట్టిస్తూ అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టంలోని లొసుగులను వాడుకుంటూ, చట్టాన్ని అపహాస్యం చేస్తూ ప్లాట్లు కొనే కష్టమర్ల కష్టార్జితాన్ని నిలువునా దోచుకుంటున్నారు.

## సన్నవడ్ల విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

- విత్తనాల నుంచి కొనుగోళ్ళ దాకా.. సమగ్ర కార్యాచరణకు అధికారుల ప్రత్యేక కమిటీ
- ఎరువుల కోసం కేంద్రంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి
- ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం
- వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

02



### కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్ మెట్రో నిధులపై రిక్వెస్ట్

03

## నేనెందుకు అడ్డుపడతా

రేవంత్ రెడ్డికి నేను జవాబుదారీ కాదు

అన్ని మెట్రోల్లాగే.. హైదరాబాద్ కూ సహకరిస్తాం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

02



### దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ యాప్పై తాత్కాలిక నిషేధం

- నీట్ లీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం.
- జూన్ 22 వరకు సేవలు బంద్.. ప్లేస్టోర్ల నుంచి తొలగింపు.
- పేపర్ లీక్ వదంతులను అరికట్టేందుకే ఉక్కుపాదం.

02



## ఎటుచూసినా.. నోట్లకట్టలే

### నోట్ల కట్టలపైనే ఆ అధికారి నిద్ర

- రూ. 200 కోట్ల ఆస్తులు కూడబెట్టిన ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్
- సుంకరి నరహరి నివాసంతో పాటు 11 చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు
- ఇంట్లో పట్టుబడ్డ రూ. 1.40 కోట్ల నగదు

02



## ఆరుట్లకు నేడు సీఎం రేవంత్ రెడ్డి



ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

తెలంగాణ విద్యారంగానికి ఆదర్శం

02







# 30 కోట్ల మోసం... కొనుగోలుదారుల్లో ఆందోళన

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో 'శ్రీకారం ఇన్ఫ్రా డెవెలపర్స్' 'ఆయుష్మాన్‌భవ్' ఐకానిక్ హౌసింగ్' సంస్థల పేరిట సాగుతున్న అక్రమ లేఅవుట్ల మాయాజాలం బట్టబయలయింది. ా పత్రికకు చిక్కిన బ్రోచర్ ప్రకారం.. 1 గుంట ప్లాట్ ధర రూ. 4,65,000, 2 గుంటల ప్రీమియం ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్ ధర రూ. 8,50,000 అంటూ వీరు ప్రచారానికి తెరలేపారు. కస్టమర్లను ఆకర్షించడానికి బ్రోచర్‌లో పొందుపరిచిన అంశాలన్నీ పచ్చి అబద్ధాలని క్షేత్రస్థాయి పరిశీలనలో తేటతెల్లమవుతోంది. వ్యవసాయ భూమిని నిబంధనల ప్రకారం మార్పిడి చేయకుండానే, బ్రోచర్‌లో మాత్రం 'నాలా కన్వర్షన్' అయిపోయినట్లు తప్పుడు ప్రకటన చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.

**గ్రాఫిక్స్ చూపిస్తూ.. గాల్లో బిజినెస్**

'ది లగ్జరియా రిసార్ట్' పేరుతో గ్రాండ్ క్లబ్‌హౌస్, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్ అంటూ లగ్జరీ కట్టడాల చిత్రాలను చూపించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు లేని అక్రమ ఫార్మ్‌ల్యాండ్ వెంచర్లలో ఇలాంటి పక్కా కట్టడాలకు ఆస్కారమే లేనప్పటికీ అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ప్లాట్లు కొనే కస్టమర్లకు రైతుబంధు, పీఎం కిసాన్, రైతుబీమా వర్తిస్తాయంటూ బ్రోచర్‌లో నమ్మబలుకుతున్నారు . వ్యవసాయ భూములను కమర్షియల్ వెంచర్లుగా మార్చి అమ్ముతున్న ఇలాంటి ప్లాట్లకు ఇవి వర్తించవని తెలిసినా కేవలం కస్టమర్లను ట్రాప్ చేయడానికే ఈ అబద్ధపు ప్రకటనలు గుప్పిస్తున్నారు.




ఎటువంటి అనుమతులు లేకుండా వందలాది ఎకరాల్లో వెంచర్లు వెలుస్తున్నా, సంబంధిత అధికారులు మౌనం వహించడం వెనుక భారీ స్థాయిలో చేతులు మారాయనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిమ్జ్ , బీదర్ ఎయిర్‌పోర్ట్, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పెద్ద ప్రాజెక్టుల చిత్రాలను బ్రోచర్‌లో చూపిస్తూ భవిష్యత్తులో కోట్ల లాభాలు వస్తాయంటూ



హైప్ క్రియేట్ చేస్తు కోట్ల రూపాయలు కొల్ల గొడుతున్నారు.'శ్రీకారం' రియల్ ఎస్టేట్ సంస్థ సాగిస్తున్న నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, 'ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్' వెంచర్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని బాధితులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సిర్గాపూర్ మండలం వాంగ్ధల్‌లో 100 ఎకరాల్లో లేఅవుట్ అనుమతులు లేకుండా ఒకచోట భూమి చూపి మరోచోట రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై, అలాగే మనూర్ మండలం దవూర్‌లో డీటీసీపీ నిబంధనలను తుంగలో తొక్కి 'ఐకానిక్' పేరిట సాగుతున్న అక్రమ దందాపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని కోరుతున్నారు.

కనీస పర్మిషన్లు లేకుండా మాయమాటలతో సామాన్యుల నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన నేపథ్యంలో, 'శ్రీకారం' రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ ప్రత్యేక దృష్టి సారించి లోతైన దర్యాప్తు చేపట్టాలని, ప్రభుత్వ ట్యాక్స్‌ల లూప్‌హోల్స్‌ను అరికట్టాలని మేధావులు పేర్కొంటున్నారు. వందలాది ఎకరాల్లో సాగుతున్న ఈ దందాకు సిర్గాపూర్, మనూర్ తహసీల్దార్ల మౌనమే రక్షణ కవచంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నందున, ఈ అక్రమ వెంచర్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేఅవుట్లను సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మహాపత్రిక సాక్షిగా స్థానిక ప్రజలు, బాధితులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారుల గుట్టు రట్టు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ దారుణమైన దోపిడీపై జిల్లా అత్యున్నతాధికారి అయిన జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి కఠిన చర్యలకు ఉపక్రమించకపోతే.. వందలాది కుటుంబాల రోడ్డున పడతాయని బాధితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







# ట్రంప్ గౌరవార్థం రేవంత్ గిఫ్ట్

- **జూన్ 23న డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ప్రారంభం**
- **గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో రోడ్డుకు పేరు**

**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో డైనమిక్ నిర్ణయం తీసుకున్నారు. గ్లోబల్ ఐకాన్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఒక ప్రముఖ రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' గా నామకరణం చేయనున్నారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రస్తుత 'యూఎస్ కాన్సులేట్ రోడ్డు'ను ఈ పేరుతో మార్చనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. జూన్ 23న ఈ రోడ్డును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4)కి ముందే జరగనున్న ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, పలువురు ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, ఐటీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఐటీ రంగానికి, ఆర్థిక వృద్ధికి అమెరికా అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతగా, అలాగే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గాను ట్రంప్ పేరును ప్రతిపాదిస్తూ గతంలో రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చింది.




# ఆరుట్లకు నేడు సీఎం రేవంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం జరగనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టేలా ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. బుధవారం ఆరుట్లకు చేరుకోనున్న సీఎం... మొదటగా టీపీఎస్ ను ప్రారంభించనున్నారు. అనంతరం, పాఠశాలను సందర్శిస్తారు. తర్వాత, అల్పాహార పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి, బ్రేక్ ఫాస్ట్ చేయనున్నారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాల భవనం సందర్శించి, అక్కడి సౌకర్యాలు, క్రీడాప్రాంగణం, కంప్యూటర్ ల్యాబ్, తదితర సౌకర్యాలు పరిశీలించనున్నారు. 11గంటల తర్వాత బహిరంగసభకు హాజరుకానున్నారు.

**తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలిః ఎమ్మెల్యే మల్ రెడ్డి...**

పదేళ్ల విధ్వంసం తర్వాత 60ఏళ్ల ఆకాంక్షలకనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ పునఃనిర్మాణం చేపట్టిందని, ఇందులో భాగంగా ఆరుట్ల నుంచి సరికొత్త విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. నిన్నమొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూసిన వారే నేడు అడ్మిషన్ల కోసం వెంటబడే పరిస్థితి రావటమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. సర్కార్ సంకల్పంలో తల్లిదండ్రులంతా భాగస్వాములై రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రాజెక్టు ఇక్కడితో పూర్తికాలేదని.... విద్యార్థులందరికీ అత్యుత్తమ విద్యనందించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా పాఠశాలలను ప్రభుత్వం నిర్మించనుందని ఆకునూరి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్థానిక నాయకులు కార్యకర్తలు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సన్నవడ్ల విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి



**ఎప్పటికపుడు కేంద్రానికి లేఖలు రాయాలి**

ఖరీఫ్ సీజన్ కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు ముఖ్యమంత్రి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, వాస్తవ పరిస్థితిని వివరించాలని సూచించారు. అవసరమైతే మంత్రులు, ఎంపీల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని చెప్పారు. మార్క్ ఫెడ్ నష్టాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వ్యాపారులకు తలొగ్గకుండా ఈ సారి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిన కారణంగా మొక్క జొన్న కొనుగోళ్లతో వచ్చే నష్టం తగ్గించగలిగామని సీఎం వివరించారు. గతంలో రూ. 13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని.. ఈసారి దాదాపు రూ. 21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్ ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభదిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు

హైదరాబాద్, మహా : రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసిఆర్ హెచ్ఆర్ డి లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి , వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్లానింగ్ విభాగం కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతుల పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంది. ఏ రైతు ఏ పంట వేశాడు, ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని చెప్పారు. రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు

రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు.

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని, రైతులకు ఉపయోగంగా ఉంటే మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు.

# నేడు వరంగల్ కు పవన్ కల్యాణ్

**వరంగల్, మహా :** వరంగల్‌లో జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం పర్యటించనున్నారు. హనుమకొండలో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడు నిరంజన్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంది. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి. ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్ ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ నేడు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది.




# దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం.

ఢిల్లీ, మహా. : దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్‌యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై భారత్‌లో తాత్కాలిక నిషేధం విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ సేవలు ఏమాత్రం అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. నీట్ పరీక్షల సమయంలో అక్రమాలకు పాల్పడే ముఠాలను అరికట్టడంతో పాటు, పేపర్ లీక్ వంటి తప్పుడు సమాచార వ్యాప్తికి చెక్ పెట్టే పకడ్బందీ చర్యల్లో భాగంగానే కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చేసిన అత్యవసర సిఫార్సుల మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్2000లోని సెక్షన్ 69ఏ కింద కేంద్రం ఈ నిషేధ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ఫలితంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తక్షణమే తొలగించారు. అలాగే యాపిల్ యాప్ స్టోర్‌లో సైతం ఈ యాప్‌ను తాత్కాలికంగా అందుబాటులో లేకుండా చేయాలని ప్రభుత్వం టెక్ దిగ్గజాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మే 2026లో జరిగిన నీట్ పరీక్షలో భారీ ఎత్తున పేపర్ లీక్ ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలో జూన్ 21న ఎన్టీఏ పకడ్బందీగా రీఎగ్జామ్ నిర్వహిస్తోంది.

ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష సమయంలో పలు టెలిగ్రామ్ ఛానెళ్లు, గ్రూపుల ద్వారా చీటింగ్ ముఠాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని ఛానెళ్లను బ్లాక్ చేసినప్పటికీ సమస్య తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. దీంతో ఏకంగా టెలిగ్రామ్ యాప్‌పైనే దేశవ్యాప్త నిషేధానికి ఎన్టీఏ సిఫార్సు చేయగా, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ చర్యలు చేపట్టింది. యాప్ నిషేధంతో పాటుగా.. జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో ఉండే 'మెసేజ్ ఎడిటింగ్' ఫీచర్‌ను కూడా పూర్తిగా నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. పాత మెసేజ్‌లను తమకు అనుకూలంగా ఎడిట్ చేస్తూ, పరీక్షకు ముందే పేపర్ లీక్ అయినట్లు కొందరు కృత్రిమ ఆధారాలు సృష్టిస్తున్న ఉదంతాలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఈ మేరకు పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది.

# ఎటుచూసినా.. నోట్లకట్టలే

**హైదరాబాద్, మహా :** ఐ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. గత కొన్ని నెలలుగా అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ అధికారులు మరో పెద్ద తిమింగలాన్ని పట్టుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీలో నివసిస్తున్న ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని వచ్చిన ఆరోపణలతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులకు భారీ మొత్తంలో నగలు, నగదు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి. మంగళవారం ఉదయం నుంచి సుంకరి నరహరి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. హైదరాబాద్ ఛత్రినాకలోని సుంకరి నరహరి ఇంటితోపాటు ఆయన కార్యాలయం, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు ఇలా మొత్తం 11 ప్రాంతాల్లో ఒకే సమయంలో దాడులు చేశారు. ఈ క్రమంలోనే సుంకరి నరహరి ఇంట్లో ఆయన బెడ్రూంలో ఉన్న బెడ్డు కింద రూ.1.40 కోట్ల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అదే విధంగా కేజీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే భారీ మొత్తంలో నగదును ఎందుకు ఉంచాల్సి వచ్చిందన్న అంశంపై ఏసీబీ అధికారులు శఅరీధర్ ను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన ఇంట్లో దొరికిన బంగారు ఆభరణాలు, డబ్బు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. సుంకరి నరహరితోపాటు ఆయన సోదరుడి ఇంట్లో భారీగా ఆస్తిపత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం



చేసుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లతోపాటు రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు విచారణలో వెల్లడైంది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్స్ ఈ సోదాలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఇప్పటివరకు దొరికిన ఆధారాల ప్రకారం ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఆస్తులు.. రూ.200 కోట్లకు పైనే ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.నరహరి నివాసంలో బ్యాంక్ డిపాజిట్లు (ఎఫ్‌డీ)లు కూడా దాదాపు రూ.కోటి వరకు ఉన్నాయని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వివరించారు. నరహరి పేరు మీద రెండు బ్యాంక్ లాకర్లు కూడా గుర్తించామన్నారు. వీటిని తనిఖీ చేసేందుకు అనుమతి కోసం బ్యాంకుకు లేఖ రాశామన్నారు. రెండు మూడు రోజుల్లో ఆ లాకర్లు ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం నరహరి నివాసంలో ఇప్పటి వరకు గుర్తించిన ఆస్తులు విలువ రూ. 5 కోట్ల ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తులు విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఆయన వివరించారు. సోదాలు పూర్తయి, ఆస్తుల వివరాలపై కొంత స్పష్టత వచ్చిన తర్వాత నరహరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

**ఇటీవల డిప్యూటీ కలెక్టర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు**

తెలంగాణ రెవెన్యూ శాఖలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి ఆర్డీవోగా పనిచేసిన సమయంలో వంశీ మోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం, మ్యుటేషన్ల కోసం రియల్టర్ల నుండి తన బంధువుల పేర్లపై 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ల రూపంలో ముడుపులుగా తీసుకోవడం వంటి కీలక అక్రమాలను అధికారులు గుర్తించి, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

# నేనెందుకు అడ్డుపడతా

**ఢిల్లీ, మహా** మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తామ రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్రం సహకారం అందిస్తోందని, సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకరమవుతాన్నారు. అంతే తప్ప కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవన్నారు. తానెందుకు అడ్డుపడతానన్నారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.



# చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో ముమ్మర దర్యాప్తు

**దర్యాప్తుపై ఎస్పీ వికాస్ రాథోడ్ కీలక వ్యాఖ్యలు.**

**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లా తుని గ్రామీణ ప్రాంతంలో సంచలనం సృష్టించిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) వికాస్ రాథోడ్ వెల్లడించారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాథమిక విచారణలో చిన్నారిని అటవీ మృగాలు లాక్కెళ్లి ఉండవచ్చనే కోణం బలంగా వినిపిస్తున్నప్పటికీ, ఈ వాదనను నిర్ధారించడానికి ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ మిస్సింగ్ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పాపను అడవి జంతువులు ఎత్తుకెళ్లినట్లు గానీ, లేదా ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు గానీ ఏ కోణంలోనూ స్పష్టమైన, పక్కా ఆధారాలు దొరకలేదని ఎస్పీ వివరించారు. కేవలం ప్రాథమిక అనుమానాలే ఉన్నాయని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరమే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. అయితే, పాప అదృశ్యమైన రోజున కురిసిన భారీ వర్షం పోలీసుల దర్యాప్తుకు తీవ్ర ఆటంకం కలిగించింది. ఈ వర్షం కారణంగా ఘటనా స్థలంలో కీలకమైన ఆధారాలు చెరిగిపోవడంతో పాటు, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి జాడలు సేకరించడం కష్టంగా మారిందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పాప ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత వేగవంతం చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. జంతువుల సంచారం ఎక్కువగా ఉండే అటవీ ప్రాంత సరిహద్దులతో పాటు వ్యవసాయ పొలాల వెంబడి అణువణువూ జల్లెడ పడుతున్నారు. ఈ గాలింపు ఆపరేషన్‌లో స్థానిక అటవీ శాఖ అధికారుల సహకారాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు. చిన్నారి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వీలైనంత త్వరగా పాప జాడను కనుగొంటామని ఎస్పీ వికాస్ రాథోడ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతంపై మీనాక్షి నటరాజన్ దృష్టి

**ఈనెల 21 నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు.**

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో విస్తృత పర్యటనలకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ అంశం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో, పార్టీ సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అట్టడుగు స్థాయి నుంచి ఎన్నికల యంత్రాంగాన్ని పటిష్టం చేసే దిశగా కార్యచరణను రూపొందించారు.

ఈ నెల 21వ తేదీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి మీనాక్షి నటరాజన్ పలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. పార్టీ కార్యక్రమాల పురోగతి, ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి కార్యకలాపాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమీక్షలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల్లో భాగంగా, బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలు) నిర్వహించే ప్రత్యేక శిక్షణా శిబిరాల్లో ఆమె స్వయంగా పాల్గొంటారు. ఓటరు జాబితాల పరిశీలన, ఎన్నికల నిర్వహణలో బీఎల్ఏల కీలక పాత్ర, బూత్ స్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు ఆమె దిశానిర్దేశం చేయనున్నారు.

పర్యటనల షెడ్యూల్ ప్రకారం జూన్ 21న మక్తల్ నియోజకవర్గంలో, జూన్ 23న ఆందోల్ నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో టీపీసీసీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొని కార్యకర్తలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. సంస్థాగత నిర్మాణం ప్రధాన లక్ష్యంగా సాగుతున్న ఈ పర్యటనలు, కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఇదిలా ఉండగా, మీనాక్షి నటరాజన్‌పై హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో దాఖలైన ఓ పిటిషన్‌ను న్యాయస్థానం ఇటీవల తిరస్కరించిన విషయం తెలిసిందే. ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసులను విచారించే ప్రత్యేక పరిధి తమకు లేదని స్పష్టం చేస్తూ, సదరు పిటిషన్‌ను కోర్టు పిటిషనర్‌కే వాపస్ చేయడం ప్రస్తుతం న్యాయ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామాల నడుమ జరుగుతున్న ఆమె పర్యటనలు పార్టీ వర్గాల్లో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# తమిళనాడు సీఎం విజయ్ సంచలన నిర్ణయం



**చెన్నై, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీవీకే అధినేత విజయ్ పరిపాలనలో తనదైన ముద్ర వేసేందుకు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్నదాతలకు భారీ ఊరటనిస్తూ సహకార రంగంలో రూ.75,000 వరకు వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుండగా, ప్రభుత్వ ఖజానాపై రూ.5,932.23 కోట్ల మేర అదనపు భారం పడనుంది. ముఖ్యమంత్రి విజయ్ మే 25న విడుదల చేసిన తొలి రుణమాఫీ ఉత్తర్వులపై రైతులు, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. నాడు కేవలం రూ.50,000 వరకు మాత్రమే రుణమాఫీ ప్రకటించారు. అదీ కాకుండా లోన్ అమౌంట్ పెరిగే కొద్దీ మాఫీ మొత్తం తగ్గిపోతూ, రూ.1 లక్ష దాటిన వారికి కేవలం రూ.5,000 మాత్రమే ఫ్లాట్ వైవర్ ఇచ్చారు. ఇది టీవీకే ఎన్నికల మేనిఫెస్టోను వంచించడమేనని విపక్షాలు మండిపడ్డాయి. దీంతో వెనక్కి తగ్గిన సీఎం విజయ్, జూన్ 15న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పాత నిబంధనలను పూర్తిగా రద్దు చేస్తూ సరికొత్త సవరించిన ప్యాకేజీని ప్రకటించారు.

**తాజా జీవోలోని ముఖ్యాంశాలు..**

**అందరికీ వర్తింపు**

తాజా సవరణ ప్రకారం ల్యాండ్ హోల్డింగ్స్ లేదా సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా.. చిన్న, మధ్యరక, పెద్ద రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. సహకార బ్యాంకుల్లో రూ.75,000 లేదా అంతకంటే తక్కువ క్రాప్ లోన్ ఉన్న ప్రతి రైతుకు 100 శాతం పూర్తి రుణమాఫీ లభిస్తుంది. ఒకవేళ రుణం అంతకంటే ఎక్కువగా ఉంటే, వారికి ఒకే మొత్తంగా రూ. 35,000 ఫ్లాట్ రుణమాఫీ వర్తింపజేస్తారు. మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలకు మాత్రమే ఈ ఊరట లభించనుంది.

**నిధుల సర్దుబాటు ఎలా?**

గతంలో ప్రకటించిన రూ.50,000 పరిమితి వల్ల ప్రభుత్వానికి కేవలం రూ.2,044 కోట్ల ఖర్చు మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు పరిమితిని రూ.75,000 కి పెంచడం, పెద్ద రైతులకు కూడా రూ.35,000 చొప్పున రాయితీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ బడ్జెట్‌పై ఏకంగా రూ.5,932.23 కోట్లు భారం పడనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం.. ఇలాంటి ప్రభుత్వ రుణమాఫీ నిధులను 45 నుండి 60 రోజుల్లోగా సహకార బ్యాంకులకు ప్రభుత్వం పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం విజయ్ స్పష్టం చేశారు.

**విపక్షాల విమర్శలు..**

ఈ నిర్ణయంపై అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి స్పందిస్తూ.. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు పూర్తి రుణమాఫీ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం రూ.75,000కు పరిమితం చేయడం సరికాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు రుణ మాఫీ చేయాలని పళనిస్వామి డిమాండ్ చేశారు.

## చిన్న కాంట్రాక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలు సఫలం

**హైదరాబాద్, మహా.** రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం వేసిన అడుగులు సత్ఫలితాలను ఇచ్చాయి. పెండింగ్ బిల్లుల సాధన కోసం ఆందోళన బాటపట్టిన చిన్న కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ కీలక సమావేశంలో కాంట్రాక్టర్ల సమస్యలపై, ప్రధానంగా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపుల అంశంపై ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం అత్యంత సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటుందని, పెండింగ్ బిల్లుల మొత్తాన్ని దశలవారీగా విడుదల చేసి వారి ఇబ్బందులను పరిష్కరిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భరోసాతో కాంట్రాక్టర్లలో ఆశావహ వాతావరణం నెలకొంది.

# జీ7 సదస్సులో ప్రధాని మోదీ

**ఇవియాన్ (ఫ్రాన్స్):మహా:** ఫ్రాన్స్‌లోని ఇవియాన్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'కు హాజరైన ఆయన.. ప్రపంచ దేశాల అధినేతలతో కలిసి ప్రస్తుత భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ఎంతో ఆత్మీయంగా ప్రత్యేక చర్చలు జరపడం అంతర్జాతీయ దౌత్య వర్గాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రష్యా ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టేలా ట్రంప్ సంచలన ప్రకటన**

ఈ సదస్సు వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక అంతర్జాతీయ సంచలన ప్రకటన చేశారు. రష్యా నుంచి సరఫరా అయ్యే చమురుపై అమెరికా త్వరలోనే మళ్లీ కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన శాంతి ఒప్పందం కారణంగా ప్రపంచంలోనే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి (Strait of Hormuz) గుండా అంతర్జాతీయ చమురు సరఫరా ఇప్పుడు ఎంతో సులభతరమైందని ట్రంప్ వివరించారు. ఈ సానుకూల పరిణామం వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్‌లో రష్యాపై మరింత కఠినమైన ఆర్థిక చర్యలు తీసుకునే వెసులుబాటు తమకు కలిగిందన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడుల నేపథ్యంలో మాస్కోపై అంతర్జాతీయ ఆర్థిక ఒత్తిడిని గరిష్ట స్థాయికి పెంచేందుకు జీ7 దేశాలు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**ప్రపంచ సవాళ్ల పరిష్కారమే 'ఔట్‌రీచ్' లక్ష్యం**

సాధారణంగా జీ7 కూటమిలోని సభ్య దేశాలు (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్), తాము ప్రత్యేకంగా ఆహ్వానించిన భారతదేశం వంటి ఇతర శక్తిమంతమైన దేశాల అధినేతలతో పాటు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కలుపుకుని ఈ ప్రతిష్టాత్మక 'ఔట్‌రీచ్ సెషన్'ను నిర్వహిస్తాయి. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన ఆర్థిక సంక్షోభాలు, ఇంధన కొరత, భద్రతాపరమైన సవాళ్లపై విసృతంగా చర్చించి ఉమ్మడి పరిష్కార మార్గాలను అన్వేషించడమే ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలోనే ప్రపంచ శాంతి, అంతర్జాతీయ వాణిజ్య భద్రతను కాపాడటంలో భారతదేశం పాత్ర ఎంతో కీలకమని జీ7 వేదికగా మరోసారి వ్యక్తమైంది




# కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్ మెట్రో నిధులపై రిక్వెస్ట్**



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఆమోదించిన రుణాన్ని వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు ఓ బహిరంగ లేఖ రాస్తూ.. మెట్రో నిధుల మంజూరులో జరుగుతున్న ఆలస్యాన్ని ప్రస్తావించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఐఆర్ ఎఫ్ సీ నుంచి జూన్ 15న నిధులు విడుదల కావాల్సి ఉందని, కానీ ఇప్పటి వరకు ఆ రుణం మంజూరు కాలేదని సీఎం లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇప్పటికే రూ.1,451 కోట్ల ఈక్విటీని చెల్లించిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను నెరవేర్చినందున, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను కూడా సకాలంలో ఇప్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడి, నిలిచిపోయిన మెట్రో రుణాన్ని వెంటనే విడుదలయ్యేలా చూడాలని కోరారు.

# పిప్రిలో ఎంపీ ధర్మపురి అరవింద్ పర్యటన

**'బాధిత కుటుంబానికి పరామర్శ, సంచలన వ్యాఖ్యలు.**

**ఆర్మూర్,మహా:** ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న గృహ దహనం ఘటనపై జిల్లా పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) ధర్మపురి అరవింద్ తీవ్ర స్థాయిలో స్పందించారు. పది రోజుల క్రితం అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి అడిగిన పాపానికి రాజమల్లు అనే వ్యక్తి ఇంటికి దుండగులు నిప్పుపెట్టి దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మంగళవారం పిప్రి గ్రామానికి చేరుకున్న ఎంపీ అరవింద్, కాలిపోయిన ఆ ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కష్టకాలంలో వారికి అండగా నిలుస్తూ, తన వంతుగా *రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని* ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. పదివేల హిందూ కుటుంబాలు ఉన్న గ్రామంలో కేవలం పది కుటుంబాలుగా ఉన్న ముస్లింలు ఇంతటి అరాచకానికి పాల్పడటంపై ఆయన మండిపడ్డారు. కుటుంబ సభ్యులంతా లోపల ఉండగానే, దారుణంగా ఇంట్లోకి పెట్రోల్ తీసుకువచ్చి నిప్పు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ అమానుషానికి ఒడిగట్టిన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందువులంతా ఏకం కాకపోతే భవిష్యత్తులో పిప్రి గ్రామం కూడా మరో బెంగాల్‌లా మారుతుందని ఆయన హెచ్చరించారు.ఇదే సమయంలో గ్రామ అభివృద్ధి కమిటీ వ్యవహరించిన తీరుపై ఎంపీ అరవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సుమారు రూ. 25 లక్షల మేర ఆస్తి నష్టం జరిగితే, కమిటీ సభ్యులు కేవలం రూ. 13 లక్షలు మాత్రమే పరిహారంగా ఎలా ఇప్పిస్తారని ఆయన నిలదీశారు. ఇలాంటి దారుణాలకు పాల్పడే వారిని గ్రామం నుంచి పంపించకుండా ఇంకా ఊరిలోనే కొనసాగించడం హిందువులకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని వ్యాఖ్యానించారు. వారిని అలాగే అక్కున చేర్చుకుంటే గ్రామాన్ని మరో బెంగాల్‌గా మారుస్తారని ఆయన అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,మహా :** గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు.

అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మన 'కారం'పై కన్నేసిన డ్రాగన్

- దేశీయ మిర్చిపై అంతర్జాతీయ కుట్ర!
- లోపాయికారీ ముఠాలతో విత్తనాల చౌర్యం
- పురుగుమందుల సాకుతో చైనా దగా
- జెమినీ వైరస్ వెనుక బయో-వార్ కోణం?
- కఠిన చర్యలు కోరుతున్న అన్నదాతలు.



**హైదరాబాద్, మహా:** ఖమ్మం, గుంటూరు, ప్రకాశం.. ఈ పేర్లు వినగానే ప్రపంచ దేశాలకు ఘాటైన, నాణ్యమైన మిర్చి గుర్తుకొస్తుంది. ముఖ్యంగా చైనా వంటి దేశాలకు మన మిర్చి లేనిదే పూట గడవని పరిస్థితి. దశాబ్దాలుగా అంతర్జాతీయ మార్కెట్లో రారాజుగా వెలుగొందుతున్న భారతీయ మిర్చిపై ఇప్పుడు ఓ భారీ అంతర్జాతీయ కుట్ర జరుగుతోందన్న సంచలన నిజాలు వెలుగుచూస్తున్నాయి. మన దేశ సంపదను దొడ్డిదారిన తరలిస్తూ, ఆరుగాలం శ్రమించే మన రైతులకు తీరని ద్రోహం చేస్తున్న డ్రాగన్ దేశం ఎత్తుగడలు, లోపాయికారీ ముఠాల దందా ఇప్పుడు వ్యవసాయ, వాణిజ్య వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.

**విత్తనాల చౌర్యం.. వ్యవస్థలోని నల్లగొర్రెల దందా**

గత కొన్నేళ్లుగా భారతదేశానికి చెందిన అత్యంత విలువైన, అధిక దిగుబడినిచ్చే మిరప విత్తనాలు చైనాకు అడ్డదారిలో స్మగ్లింగ్ అవుతున్నాయి. దొంగిలించిన మన విత్తనాలతోనే తమ దేశంలో మిర్చిని పండించి, అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశానికే పోటీగా నిలబెట్టాలనేది చైనా కుట్రపూరిత వ్యూహం. ఈ దందాను వెనకుండి నడిపిస్తున్న కొన్ని స్వార్థపూరిత శక్తులు, 'కమ్మీ ముఠాలు' ఇంకా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనే పాతుకుపోయి ఉండటం అత్యంత శోచనీయం. ప్రభుత్వ ఉద్యోగుల ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్న ఈ నల్లగొర్రెలు, మన రైతుల కడుపుకొడుతూ చైనాకు లాభాలు చేకూరుస్తున్నారు.

**క్వాలిటీ పేరుతో సరికొత్త డ్రామా**

ఖమ్మం, గుంటూరు మార్కెట్ల నుండి ఏటా వందల కోట్ల రూపాయల విలువైన మిర్చిని కొనుగోలు చేసే చైనా, ఇప్పుడు హఠాత్తుగా ప్లేట్ మార్చింది. "క్వాలిటీ లేదు" అనే సాకుతో భారతీయ మిర్చి లోడింగులను వరుసగా తిరస్కరిస్తోంది. దీని వెనుక ఉన్నది నాణ్యతా లోపం కాదు, అదో పెద్ద అంతర్జాతీయ కుట్ర. మన ఉత్పత్తుల నాణ్యతను ప్రపంచం ముందు తక్కువ చేసి చూపి, అంతర్జాతీయ మార్కెట్లో "భారతీయ మిర్చి" బ్రాండ్ ఇమేజ్‌ను మసకబార్చడమే డ్రాగన్ అసలు ప్లాన్. తద్వారా డిమాండ్‌ను, ధరలను అమాంతం పడగొట్టి మన రైతుల నడ్డి విరవాలని ఆ దేశం కుతంత్రాలు పన్నుతోంది. ఇక్కడ తేలాల్సిన అతి ముఖ్యమైన విషయం ఒకటుంది. చైనా తిరస్కరించిన ఆ మిర్చి నాణ్యంగానే ఉందని, ఎగుమతికి అర్హమైనదేనని భారత ప్రభుత్వం పేరుతో తొలుత "క్వాలిటీ క్లియరెన్స్" ఇచ్చిన అధికారులు ఎవరు? ఒకవేళ నిజంగానే నాణ్యత లేకపోతే సర్టిఫికెట్ ఎలా ఇచ్చారు? వ్యవస్థలోని కొందరు లంచగొండి అధికారులు చైనా ఏజెంట్లతో చేతులు కలిపి ఈ డ్రామా ఆడుతున్నారా అన్న కోణంలో సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**జెమిని వైరస్ వెనుక బయో-వార్ కోణం?**

కొన్నేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, గుంటూరు, ప్రకాశం తదితర ప్రాంతాలలో మిరప పంటను సర్వనాశనం చేసిన "జెమిని వైరస్" తీవ్రతను రైతాంగం ఇంకా మర్చిపోలేదు. వేలాది ఎకరాల్లో పంట తుడిచిపెట్టుకుపోయి, రైతులు కోట్లలో నష్టపోయి అప్పుల పాలయ్యారు. అయితే, మన దేశీయ మిర్చి మార్కెట్‌ను కోలుకోకుండా చేయడానికి విదేశీ ల్యాబ్‌ల నుండి ఉద్దేశపూర్వకంగానే ఈ వైరస్‌ను వ్యాప్తి చేశారా అనే బలమైన అనుమానాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. మిర్చి మార్కెట్‌పై గుత్తాధిపత్యం కోసం జరిగిన ఈ 'బయోవార్' కోణంపై జాతీయ భద్రతా సంస్థలు లోతైన దర్యాప్తు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

> **రైతును కాపాడుకుందాం.. దేశ బ్రాండ్‌ను నిలబెట్టుకుందాం**
>
> ఇది కేవలం రెండు దేశాల మధ్య జరిగే సాధారణ మిర్చి వ్యాపారానికి సంబంధించిన వివాదం కాదు. ఇది మన దేశ ఆహార భద్రత, అన్నదాతల ఆరుగాలపు శ్రమ, భారత ఆర్థిక వ్యవస్థపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, జాతీయ నిఘా సంస్థలు మేల్కొనాలి. విదేశీ ముఠాలతో చేతులు కలిపిన మన మంత్రిత్వ శాఖల్లోని నల్లగొర్రెలను, చైనా ఏజెంట్లను ఏరిపారేయాలి. కఠినమైన చట్టపరమైన చర్యల ద్వారా దోషులను శిక్షించినప్పుడే.. మన రైతుల కన్నీరు తుడుచుకోగలం, అంతర్జాతీయ స్థాయిలో భారతీయ మిర్చి బ్రాండ్‌ను సగర్వంగా నిలబెట్టుకోగలం.

**పురుగుమందుల వాడకం.. వాస్తవాలు వర్సెస్ చైనా దుష్ప్రచారం**

మన మిర్చిలో రసాయనాలు ఎక్కువగా ఉన్నాయని గగ్గోలు పెడుతున్న చైనా వాదనల్లో ఎలాంటి పసాలేదని అంతర్జాతీయ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాగవుతున్న పంటల విస్తీర్ణాన్ని, వాడుతున్న పురుగుమందుల పరిమాణాన్ని పరిశీలిస్తే.. భారతీయ రైతులు వాడే రసాయనాల సగటు చాలా తక్కువ. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ , కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం... భారతదేశంలో హెక్టారుకు సగటున కేవలం 0.5 నుంచి 0.6 కిలోల (ఎకరానికి సుమారు 200 గ్రాములు) పురుగుమందులు మాత్రమే వాడుతున్నారు. ప్రపంచ సగటు హెక్టారుకు 2.4 కిలోలుగా (ఎకరానికి 970 గ్రాములు) ఉంది. కానీ, "క్వాలిటీ" గురించి నీతులు చెబుతున్న చైనా.. హెక్టారుకు ఏకంగా 13 కిలోల (ఎకరానికి 5.2 కిలోలు) మేర రసాయనాలను గుప్పిస్తోంది.

మన దేశంలో పంజాబ్, తెలంగాణ, ఏపీ వంటి రాష్ట్రాల్లో గరిష్టంగా వాడినా అది హెక్టారుకు 4 కిలోల లోపే ఉంటుంది. చైనా తక్కువ భూమిలో అత్యధిక దిగుబడి సాధించడం కోసం విపరీతంగా రసాయన ఎరువులను, పురుగుమందులను, కలుపు మందులను వాడుతోంది. మరోవైపు భారతీయ రైతులు ఇప్పటికీ సేంద్రియ ఎరువులు, వేపనూనె వంటి సహజసిద్ధమైన పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మనకంటే 20 రెట్లకు పైగా ఎక్కువ పురుగుమందులను వాడే చైనా.. మన ఉత్పత్తులపై నిందలు వేయడం ముమ్మాటికీ వాణిజ్య కుట్రేనని స్పష్టమవుతోంది.

# వానొచ్చినా... వరదొచ్చినా...

వర్షాకాలం వచ్చింది. వానలు మొదలు అయ్యాయి. చినుకులు పడితే చాలు, చిత్తడి సమస్యలు ముంగిట నిలుస్తున్నాయి. వానలతో పాటు పెనుగాలులు తోడై ప్రజలను వణికిస్తున్నాయి. భారీ వృక్షాలు, కరెంట్ స్థంభాలు నేల కూలుతున్నాయి. విద్యుత్ తీగలు యమ పాశాలవుతున్నాయి. వాగులు పొంగుతున్నాయి. వంకలు పారుతున్నాయి. పిడుగులు, ఉరుములు, గాలి వానలు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు చాలా వరకు ఇదీ పరిస్థితి. ఉన్నట్లుండి కుండపోత వర్షాలు జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రోడ్లు చెరువుల వుతున్నాయి. పురాతన ఇళ్ళు కుప్పకూలుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. జనాల ప్రాణాలు పోతున్నాయి. ఇది ఈ ఏడాది కొత్తగా వచ్చిన సమస్యలు ఏమి కాదు. ప్రతీ వర్షాకాలం ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులే. జనాలు కూడా వీటికి అలవాటు పడ్డారు. ముప్పు ముంచుకు వచ్చినప్పుడు కాసేపు పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహంతో ఊగి పోవటం, తర్వాత పరిస్థితితో రాజీ పడటం జనానికి అలవాటు అయింది. ఇక సమస్య ఎదురైనప్పుడు హడావిడి చేయటం, వెళ్లి పోవటం అధికారుల వంతు కాగా ఇప్పుడు అదే జరుగుతోంది. ఇక ఈ నిర్లక్ష్యం తగదు. బాధ్యతగా ఉండాలి. వర్షాలు వస్తే అప్రమత్తం గా వ్యవహరించాలి. ఇందులో ఉపక్షను సహించే ప్రసక్తే లేదు. నిర్లక్ష్యం వహించే అధికారులను వదిలేది లేదు అంటున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.




సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహానికి కారణం లేకపోలేదు. ఇటీవల హైదరాబాద్ లో వర్షం కురిసినప్పుడు బీభత్స పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ట్రాఫిక్ కష్టాలు మధ్య నగర ప్రజలు నరకమే అనుభవించాల్సి వచ్చింది. దీనిపై సీఎం సీరియస్ అయ్యారు. వర్షాలపై వాతావరణ శాఖ అప్రమత్తం చేసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉండి పోవటం వల్లే హైదరాబాద్ ప్రజలు ఇబ్బంది పడ్డారన్న సమాచారం తెలుసుకున్న సీఎం ఇక ముందు ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిందేనంటూ అధికారులకు గట్టి వార్నింగ్ ఇచ్చేసారు. వర్షాలు వస్తే హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాఫిక్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఉండాలని సూచించారు. అవసరం అయితే తాను కూడా పర్యటన చేస్తానని చెప్పేసారు. హైదరాబాద్ తో పాటు తెలంగాణలో లోతట్టు ప్రాంతాలు, వర్షాలకు ప్రభావితం అయ్యే ప్రదేశాలు ముందే గుర్తించి జాగ్రత్త లు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాల వల్ల ఎలాంటి దుర్భర పరిస్థితిని ప్రజలు ఎదుర్కోవటానికి ఆస్కారం ఉండకూడదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అధికారులు తలలు ఉపారు. కానీ ఇది ఎంత మేరకు సాధ్యం. హైదరాబాద్ లో చినుకులు పడితే ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుంది. వర్షం నీరు రోడ్డుపై చేరి చెరువులు అవుతాయి. ఇది సరి చేయటం ఏ డిపార్టుమెంట్ వల్ల అయ్యే పనికాదు. హైదరాబాద్ లో అయిదు సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయితే ట్రాఫిక్ క్లియర్ చేయటానికి అయిదు నుంచి ఆరు గంటలు పడుతుంది. ముఖ్యంగా కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, అమిర్ పేట్, బేగంపేట్, ప్యారడైజ్, ప్యాట్నీ, నాంపల్లి, మలక్ పేట్, ఎల్ బీ నగర్ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య ఎదురువుతోంది. జనవాసాలు పెరగటం, అపార్ మెంట్లు ఈ సమస్యకు మూలం. వర్షం నీరు ఎటు పోయే దారి హైదరాబాద్ లో లేకుండా పోయింది. దీంతో రోడ్లు చెరువులుగా మారి ట్రాఫిక్ సమస్యలు తప్పట్లేదు.

హైదరాబాద్ లో నాలాల నిర్వహణ కూడా ఓ పెద్ద సమస్య అయింది. నాలాలు పూర్తిగా కబ్జా అయ్యాయి. ఇక సుమారు 35 నుంచి 60 కిలోమీటర్లు మేరకు ఇళ్ల మధ్య నుంచి పారే నాలాలు చిన్న వర్షం వచ్చినా సమీపంలోని ప్రాంతాల పై విరుచుకు పడుతున్నాయి. హైదరాబాద్ లోని నాలాల నిర్వహణ అధికారులకు ఓ పెద్ద సవాల్ గా మారింది. ఇవే ముంపునకు కారణం అవుతున్నాయి. వీటి పూడిక తీతలు జరుగుతున్నా మళ్ళీ స్థానికులు వాటిలోనే చెత్త, వ్యర్థ పదార్థాలు పడేస్తూనే వుంటారు. దీంతో పరిస్థితి మొదటికే వస్తోంది. ఇక పాతబస్తీ గురించి చెప్పుకోవాలి అంటే అది మాటలకు అందని దుస్థితి. ఇరుకు గల్లీలు, మురికి నీళ్లు, దుర్వాసన ఇక్కడ షరా మామూలే. వర్షం పడితే ఇక్కడ ఏ ఇళ్ళు కులుతుందో, ఏ విద్యుత్ స్థంభం నెత్తిన పడుతుందో, ఏ విద్యుత్ తీగలు ప్రాణాలు బలిగొంటాయో తెలీదు. ఇది హైదరాబాద్ లో వర్షాకాలంలో ఎదురయ్యే సాధారణ పరిస్థితి.

తెలంగాణ వ్యాప్తంగా వర్ష ప్రభావిత ప్రాంతాలను ఓ సారి పరిశీలన చేస్తే ఒక్కసారిగా గుర్తుకు వచ్చేది వరంగల్. భారీ వర్షం పడితే ఇక్కడ కాలనీలు నెలల తరబడి ముంపులో ఉండిపోవాల్సిందే. గత ఏడాది ఇదే కష్టం ఇక్కడి ప్రజలను వెంటాడింది. వరంగల్ సమీపంలోని బొంది వాగు ముప్పు ఇక్కడి ప్రజలకు కొరకరాని కొయ్యగా మారింది. కరీంనగర్ నగరం కూడా ముంపు బాధిత జాబితాలోనే వుంది. నల్గొండ, మహబూబ్ నగర్, నిర్మల్ ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలోని నగరాలు, పట్టణాలు చిన్న వర్షానికే చిత్తడి అవుతున్నాయి. ముంపు నుంచి బయట పడే నగరం ఇప్పుడు కనిపించడం కష్టం. ఇష్టం వచ్చిన రీతిలో సాగించిన నిర్మాణాలు, అపార్ట్ మెంట్లు, నాలాల కబ్జాలు, చెరువులు ఆక్రమణలు వెరసి వరదలు. ఇదే ఇప్పటి తెలంగాణ. భారీ వర్షాలను ఎవ్వరు అడ్డుకోలేరు. వరదలు వస్తే ఆపలేరు. ఎంత మంది అధికారులు రంగంలోకి దిగిన భారీ వర్షాలు తెచ్చే సమస్యలు పరిష్కరించటం అసాధ్యం. వారు చేయగలిగింది ప్రాణ నష్టం జరగకుండా చూడటం ఒక్కటే. వరదల సమస్య పోతే కానీ ప్రజలకు ఇబ్బంది తప్పదు. అందుకు కబ్జాల బెడద పై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. చెరువులు కాపాడాలి. కాలువల నిర్మాణం సరిగా ఉండేలా చూసుకోవాలి. అన్నింటికీ మించి వర్షం నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలను చైతన్యవంతం చేస్తే తప్పా ఇవి సాధ్యం కావు. ప్రజలు అలాంటి ఆలోచన చేయరు. ఎక్కడో అక్కడ నివాసం ఏర్పాటు చేసుకోవాలి అనే ఆలోచన తప్పా తాము నివాసముండే ప్రాంతం చెరువులు, కాలువలు వుండే ప్రాంతమా అనేది చూడటం లేదు. నిండా మునిగిన తర్వాత కానీ పరిస్థితి అర్థం కావట్లేదు. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వున్నప్పుడే ఈ ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అప్పటి వరకు ఏ ప్రయత్నం చేసినా అది కంటి తుడుపు చర్యగానే నిలుస్తుంది.



- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.

# ఉల్లిపాయలపై నల్లటి చారలు కనిపిస్తున్నాయా?

## తినొచ్చా లేదా పారేయాలా? నిపుణులు చెప్పిన నిజాలు ఇవే!



ఉల్లిపాయ లేకుండా తెలుగు ఇంటి వంటగది పూర్తికాదనే చెప్పాలి.** పప్పు నుంచి కూర వరకు, పచ్చడి నుంచి స్నాక్స్ వరకు దాదాపు ప్రతి వంటకంలో ఉల్లిపాయ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే చాలా మంది ఇంట్లో కిలోల కొద్దీ ఉల్లిపాయలను నిల్వ ఉంచుకుంటారు. అయితే నిల్వ ఉంచిన ఉల్లిపాయలపై కొన్నిసార్లు నల్లటి పొడి, చారలు లేదా మచ్చలు కనిపిస్తూ ఉంటాయి. వాటిని చూసి చాలామంది ఆందోళన చెందుతారు. ఇవి ప్రమాదకరమైన బ్లాక్ ఫంగస్ లక్షణాలా? అలాంటి ఉల్లిపాయలను తింటే ఆరోగ్యానికి హానికరమా? లేక బయట పొర తీసేస్తే సరిపోతుందా? అనే సందేహాలు తరచుగా వస్తుంటాయి.

నేపథ్యంలో ఉల్లిపాయలపై కనిపించే నల్లటి చారల వెనుక ఉన్న అసలు కారణాలు, వాటివల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలు, ఎప్పుడు వాటిని వాడవచ్చు, ఎప్పుడు పారేయాలి, అలాగే ఎక్కువ రోజులు తాజాగా నిల్వ ఉంచేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటో తెలుసుకుందాం.



### ఉల్లిపాయలపై నల్లటి చారలు ఎందుకు ఏర్పడతాయి?

ఉల్లిపాయలపై కనిపించే నల్లటి పొడి లేదా మచ్చలు సాధారణంగా *ఆస్పెర్గిల్లస్ నైజర్ (Aspergillus niger)*అనే ఫంగస్ కారణంగా ఏర్పడతాయి. ఇది ప్రకృతిలో సాధారణంగా కనిపించే ఒక శిలీంధ్రం. ముఖ్యంగా గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, అధిక తేమ ఉండటం, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వంటి పరిస్థితుల్లో ఈ ఫంగస్ వేగంగా అభివృద్ధి చెందుతుంది.వర్షాకాలం లేదా తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిల్వ చేసిన ఉల్లిపాయలపై ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ప్లాస్టిక్ సంచుల్లో లేదా మూసివేసిన డబ్బాల్లో ఉల్లిపాయలను ఉంచినప్పుడు గాలి సరైన విధంగా ప్రసరించకపోవడంతో ఫంగస్ పెరిగే అవకాశాలు మరింత ఎక్కువవుతాయి.

### ఇది ప్రమాదకరమైన 'బ్లాక్ ఫంగస్'నా?

ఉల్లిపాయలపై కనిపించే ఈ నల్లటి పొరను చూసి చాలామంది కరోనా సమయంలో ఎక్కువగా వినిపించిన 'బ్లాక్ ఫంగస్' (మ్యూకోర్మైకోసిస్) తో పోల్చుతుంటారు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ రెండింటికి సంబంధం లేదు.

ఉల్లిపాయలపై కనిపించే ఆస్పెర్గిల్లస్ నైజర్ సాధారణంగా నిల్వ సమయంలో ఏర్పడే ఫంగస్ మాత్రమే. ఇది మ్యూకోర్మైకోసిస్‌కు కారణమయ్యే మ్యూకోర్మైసెట్స్ శిలీంధ్రాల కంటే చాలా తక్కువ ప్రమాదకరమైనది. అయినప్పటికీ దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం కూడా మంచిది కాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

### నల్లటి మచ్చలు ఉన్న ఉల్లిపాయలను తినవచ్చా?

ఈ ప్రశ్నకు సమాధానం ఉల్లిపాయ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

ఉల్లిపాయ పై పొరపై మాత్రమే నల్లటి చారలు లేదా పొడి కనిపిస్తే, లోపలి పొరలు తెల్లగా, గట్టిగా మరియు తాజాగా ఉంటే వాటిని పూర్తిగా పారేయాల్సిన అవసరం లేదు. ప్రభావితమైన పై పొరలను తొలగించి, ఉల్లిపాయను శుభ్రంగా కడిగి వంటలో ఉపయోగించవచ్చు.

### ఆరోగ్యంపై ప్రభావం ఎలా ఉంటుంది?

సాధారణంగా బయట పొరలపై మాత్రమే ఉన్న ఫంగస్ వల్ల పెద్దగా ఆరోగ్య సమస్యలు రావు. అయితే ఎక్కువకాలం ఫంగస్ ప్రభావిత ఆహార పదార్థాలను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొన్ని రకాల ఫంగస్‌లు **మైకోటాక్సిన్లు** అనే విషపూరిత పదార్థాలను ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. వీటిలో ఒకటైన **ఒక్రాటాక్సిన్A** అధిక మోతాదులో శరీరంలోకి వెళ్లితే కిడ్నీలు, కాలేయం వంటి అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి.అందువల్ల ఫంగస్ ఉన్న ఉల్లిపాయలను నిర్లక్ష్యంగా ఉపయోగించడం కంటే, ప్రభావిత భాగాన్ని పూర్తిగా తొలగించి మాత్రమే వాడటం మంచిది.

అయితే నల్లటి రంగు లోపలి పొరల వరకు వ్యాపించి ఉంటే, ఉల్లిపాయ మెత్తబడిపోయి ఉంటే, దుర్వాసన వస్తుంటే లేదా లోపల కుళ్లిన లక్షణాలు కనిపిస్తే మాత్రం దానిని ఉపయోగించకూడదు. అలాంటి ఉల్లిపాయలను వెంటనే పారేయడం మంచిది.





### గాలి ప్రసరణ ఉండేలా నిల్వ చేయాలి

ఉల్లిపాయలను గాలి చొరబడే బుట్టలు, వల సంచులు లేదా పేపర్ బ్యాగుల్లో ఉంచడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల తేమ నిల్వ ఉండదు.

### ప్లాస్టిక్ సంచులను నివారించాలి

ప్లాస్టిక్ కవర్లలో ఉల్లిపాయలను ఎక్కువకాలం ఉంచితే లోపల తేమ పెరిగి ఫంగస్ అభివృద్ధి చెందుతుంది. అందుకే ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేయకపోవడం మంచిది.

### పొడి ప్రదేశాన్ని ఎంచుకోవాలి

ఉల్లిపాయలను ఎల్లప్పుడూ పొడి, చల్లటి, గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో ఉంచాలి. వంటగదిలో ఎక్కువ వేడి ఉండే ప్రాంతాల్లో నిల్వ చేయకూడదు.

### పాడైన ఉల్లిపాయలను వెంటనే తొలగించాలి

ఒక ఉల్లిపాయ కుళ్లిపోతే దాని ప్రభావం పక్కన ఉన్న వాటిపై కూడా పడుతుంది. అందువల్ల నిల్వలో ఉన్న ఉల్లిపాయలను తరచుగా పరిశీలిస్తూ పాడైన వాటిని వెంటనే తొలగించాలి.

### బంగాళాదుంపలతో కలిపి ఉంచకూడదు

బంగాళాదుంపలు విడుదల చేసే తేమ, వాయువుల కారణంగా ఉల్లిపాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. అందుకే రెండింటిని వేర్వేరుగా నిల్వ చేయడం మంచిది.

### నిపుణుల సూచన

ఉల్లిపాయలపై కనిపించే నల్లటి చారలు సాధారణంగా పెద్ద ప్రమాదం కాకపోయినా వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయకూడదు. ఫంగస్ బయట పొరలకే పరిమితమై ఉంటే ఆ భాగాన్ని తొలగించి ఉపయోగించవచ్చు. అయితే ఫంగస్ లోపలికి వ్యాపించి ఉంటే, ఉల్లిపాయ మెత్తబడిపోయి ఉంటే లేదా దుర్వాసన వస్తుంటే వెంటనే పారేయాలి.

### ఎవరెవరు మరింత జాగ్రత్తగా ఉండాలి?

కొంతమందికి ఫంగస్ ప్రభావిత ఆహార పదార్థాల వల్ల ఇన్ఫెక్షన్లు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా:

- రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు
- నియంత్రణలో లేని మధుమేహం ఉన్నవారు
- దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు
- కాలేయం లేదా కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు
- వృద్ధులు

ఇలాంటి వారు నల్లటి చారలు కనిపించే ఉల్లిపాయలను పూర్తిగా నివారించడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

ఉల్లిపాయలను ఎక్కువ రోజులు తాజాగా నిల్వ ఉంచాలంటే?

ఉల్లిపాయలపై ఫంగస్ రాకుండా ఉండాలంటే సరైన నిల్వ విధానం చాలా ముఖ్యం. కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటిస్తే ఉల్లిపాయలు ఎక్కువకాలం తాజాగా ఉంటాయి.



**ముగింపు :** ఉల్లిపాయలపై కనిపించే నల్లటి మచ్చలు చాలా సందర్భాల్లో నిల్వ సమయంలో ఏర్పడే ఫంగస్ వల్లే వస్తాయి. సరైన నిల్వ పద్ధతులు పాటిస్తే ఈ సమస్యను చాలా వరకు నివారించవచ్చు. అలాగే నల్లటి చారలు కనిపించిన ప్రతి ఉల్లిపాయను పారేయాల్సిన అవసరం లేకపోయినా, వాటి స్థితిని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడం ఆరోగ్య పరంగా ఉత్తమమైన చర్య. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తాజా, శుభ్రమైన ఆహార పదార్థాల వినియోగానికే ఎప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలి.



# బాధలో బాసటగా..

## కంది మౌనా శ్రీనివాస రెడ్డి పరామర్శ

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి చెంతకు వెళ్లి కుటుంబాలకు ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి. ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన దేశెట్టి రవి నివాసాన్నిమంగళవారం ఆమె మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి సందర్శించారు.అతని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, డేరా కృష్ణా రెడ్డి తదితరులున్నారు..

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మరో ముందడుగు

- క్షేత్ర స్థాయిలో సందర్శించిన ఏవియేషన్ అధికారులు
- కలెక్టరేట్ లో ఉన్నతస్థాయి సమీక్ష
- భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామన్న కలెక్టర్
- డిఫెన్స్‌కు 1,500 రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జాయింట్ యూజర్ డిఫెన్స్‌సివిల్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్‌వే విస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు.జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీకి భూములను అప్పగిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు. అటు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవంతానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు.ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెగ్డే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# డొంక దారి మరమ్మతుల కోసం ఆర్థిక సహాయం

**కారేపల్లి, మహా:** వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సూచన మేరకు,ఎర్రబోడు నుండి బురుగు కుంట డొంక దారి మరమ్మతుల కోసం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు గుడిపూడి తిరుమలరావు మంగళవారం 5వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని అన్నారు. అదేవిధంగా ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాస రావు మరో 5వేల రూపాయలను,ఎర్రబోడు సర్పంచ్ ఈసాల అలివేలు మంగ,ఉపసర్పంచ్ కడియాల రమాదేవి సంయుక్తంగా మరో 5 వేల రూపాయలను గ్రామస్తులకు ఆర్థిక సహాయం రూపంలో అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కుల కుమార్,నర్సింగ్ శ్రీనివాస్,కడియాల సుధాకర్,ఈసాల నాగేశ్వరరావు భూక్య వెంకన్న,వాంకుడోత్ హతియా,భూక్యా బాలు, వాంకుడోత్ సురేష్,కుమ్మరి నవకిషోర్,వాంకుడోత్ వీరేందర్,వాంకుడోత్ సుశాంత్,రెడ్డిబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# యోగాతోనే సంపూర్ణ... ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి

- మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.

**జవహర్ నగర్, మహా :** యోగాతోనే సంపూర్ణ ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని ప్రతి ఒక్కరు యోగ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, జవహర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డిని యోగ ఆశ్రమ నిర్వాహకులు శంకరాచార్య సమక్షంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఆధునిక కాలంలో రకరకాల రోగాలతో చిన్న వయసులోనే ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని యోగా చేస్తే రోగాలు దరి చేరవన్నారు. వయస్సుతో భేదాభిప్రాయం లేకుండా ఆసనాలు చేయవచ్చని, యోగ మనిషి మానసిక స్థితిని అదుపులోకి తెస్తుందని సూర్య నమస్కారాలు చాలా శ్రేష్టమైనవని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరసయ్య యాదవ్, పద్మారావు, శ్రీనివాస్, వీరాచారి, నితిన్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పాయం చొరవతో దోమలవాగు చెరువుకు మహర్దశ

- మినీ రిజర్వాయర్ ఏర్పాటుకు సర్వం సిద్ధం – 14 వేల ఎకరాలకు సాగునీటి వరం

**బూర్గంపహాడ్, మహా:** పినపాక నియోజకవర్గ రైతుల ఎన్నో ఏళ్ల కల సాకారం కానుంది. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో బూర్గంపహాడ్ మండలంలోని నకిరిపేట దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సీతారామ కెనాల్ ద్వారా గోదావరి జలాలను దోమలవాగు చెరువుకు మళ్లించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా యూటీ (UT) నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బూర్గంపహాడ్ మండల రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని అన్నారు. దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం ద్వారా సుమారు 14 వేల ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందుబాటులోకి వస్తుందని, తద్వారా రైతుల నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని తెలిపారు. రిజర్వాయర్ ఏర్పాటుకు అవసరమైన యూటీ నిర్మాణం కోసం ప్రస్తుతం రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ ప్రకటనతో అక్కడి రైతుల్లో, స్థానిక ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుని, పంటల దిగుబడులు పెరగడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మినీ రిజర్వాయర్ ఏర్పాటు వెనుక లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కృషి, పట్టుదల ఎంతో కీలకమని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రాజెక్టు సాధన కోసం నిరంతరం కృషి చేయడం వల్లే ఈ పనులు ప్రారంభ దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. దోమలవాగు చెరువు మినీ రిజర్వాయర్‌గా రూపుదిద్దుకోనున్న నేపథ్యంలో బూర్గంపహాడ్ మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న వేలాది ఎకరాల భూములకు జీవనాడిగా ఈ ప్రాజెక్టు మారబోతోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు రైతులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. దోమలవాగు మినీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే బూర్గంపహాడ్ మండల వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్....

**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలోని పేరేపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్ సర్పంచ్ బాణోత్ పద్మావతి వీరభద్రు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నారని, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, వారానికి మూడు సార్లు కోడిగుడ్డుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలతోపాటు ఏఐ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ విద్యను కూడా ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్యాంలాల్, టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు



# పిల్లల ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కంది మౌనా శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలో నూతనగా వెలిసిన కేర్ పిల్లల హాస్పిటల్ ను మంగళవారం అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి , మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనూష తో కలిసి సందర్శించారు. రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్ ను ప్రారంభించారు.. యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.. అనంతరం అతిథులను యాజమాన్యం శాలువాలతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, డేరా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీసీఐ పాపం ఎమ్మెల్యే ఎంపీ లదేమాజీ మంత్రి

- సాధన కమిటీ తో కలిసి ఫ్యాక్టరీ సందర్శన
- ఎమ్మెల్యే తీరు పట్ల నిరసన
- ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా
- కమీషన్ల కోసమేనంటూ ఆరోపణ

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ కూల్చివేతకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ,ఎంపీ నగేష్ లు కారణమని ఆ పాపం వారిదేనని మాజీ మంత్రి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న ఘాటుగా విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సీసీఐ సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ లక్ష్యంగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం "హలో యువత.. చలో సీసీఐ పరిశ్రమ నిరసన ర్యాలీ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీసీఐ ఫ్యాక్టరీ ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర మంత్రులు హామీలు ఇచ్చి.. ఇప్పుడేమో తుక్కు కింద విక్రయించడంపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.పరిశ్రమ పునఃప్రారంభానికి కృషి చేస్తామని చెప్పి ఎన్నికలలో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు దండుకున్నారని ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్ వ్యాపార వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నారని, అందుకే ఫ్యాక్టరీని ఫ్యాక్టరీ ని తుక్కుకింద అమ్మేస్తున్నారని విమర్శించారు. కమీషన్లకు ఆశపడే ఫ్యాక్టరీ ని కూల్చుతున్నారన్నారు. మున్సిపల్, విద్యుత్ శాఖలకు సిసిఐ బకాయిలు ఉన్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభంపై సాధన కమిటీ ఆధ్వర్యంలో అనేక మార్లు పోరాడినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందనలేదని మండిపడ్డారు. ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూ నిర్వాసితులు తమ భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ నాయకులు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**మహా వరంగల్ బ్యూరో;** రానున్న వర్షాకాలంలో సంభవించే సహజ విపత్తులు, వరదల నివారణకు సంబంధించి అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం గా ఉండాలి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గృహాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావుకు సూచించారు. గ్రామాలలో నాలుగు రకాల చేతలను సేకరించుటలో ఏదో ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి గ్రామాలలో నాలుగు చెత్త ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని అన్నారు. ఎలక్ట్రికల్ శాఖ ఆధ్వర్యంలో రానున్న ప్రకృతి వైపరీత్యాల వలన ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎలక్ట్రిసిని ఎస్సీ ఆనందంకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి,అదనపు కలెక్టర్ వై వి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల కర్తవ్యం

- మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు
- తప్పిపోయిన చిన్నారిని తల్లికి అప్పగించిన మట్వాడ పోలీసులు

**మహా వరంగల్ క్రైం;** వరంగల్ నగరంలోని గిర్మాజిపేట ప్రాంతానికి చెందిన 6 సంవత్సరాల చిన్నారి ఇంటి నుండి తప్పిపోయి కనిపించకుండా పోయింది. ములుగు రోడ్డు లో ఆ చిన్నారిని బీసీఎస్ కానిస్టేబుల్ గుర్తించారు. చిన్నారి తన వివరాలు చెప్పలేక పోవడంతో, బీసీ ఎస్ కానిస్టేబుల్ నరేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆమె నివాసాన్ని గుర్తించి కుటుంబ సభ్యులను సంప్రదించారు.మట్వాడ ఎస్సై జెడ్. రాజేందర్ సమక్షంలో చిన్నారిని ఆమె తల్లికి సురక్షితంగా అప్పగించారు. తమ బిడ్డను క్షేమంగా అప్పగించినందుకు చిన్నారి తల్లి పోలీసు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు.చిన్నారిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేర వేసిన కానిస్టేబుల్ నరేష్ , ఎస్సై జెడ్. రాజేందర్ లను ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తో పాటు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



# ఎన్టీఆర్ నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

**మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై ఆరా**

**కుషాయిగూడ, మహా :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మంగళవారం పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి కాలనీవాసులను కలుసుకుని తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాలనీ అధ్యక్షుడు వాసు చారి, కార్యదర్శి మధు ముదిరాజ్, స్థానిక నాయకులు భానూరి రాకేష్, రిజ్వాన్, నరేష్, శ్రీకాంత్ గౌడ్, భీష్మాచారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# బూర్జు బావి గ్రామంలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జూన్ 16 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బూర్జు బావి గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం అందించే లక్ష్యంతో నిర్మించనున్న మహిళా సంఘం భవనానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం ఘనంగా జరిగింది ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న లబ్ధిదారులు గ్రామ సర్పంచ్ వల్లాల వాసవి రమేష్ నూతనంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో కూడాఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. గృహప్రవేశ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను అభినందించి, వారికి పట్టుబట్టలు అందజేయడంతో పాటు యాటపొట్టేళ్ల కార్యక్రమానికి ఆర్థిక సహాయం కూడా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని, మహిళా సంఘం భవనం నిర్మాణం ద్వారా గ్రామ మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు వివిధ సామాజిక కార్యకలాపాలకు ఒక వేదిక అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం అవుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్టుతో అశ్వాపురంలో సాగునీటి వెలుగులు..

- మారెళ్ళపాడు లిఫ్ట్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే పాయం..
- రైతులకు త్వరలోనే నీరందిస్తామని హామీ

**మణుగూరు/అశ్వాపురం, మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులతో పినపాక నియోజకవర్గ వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభించనుందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ-మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, చేపడుతున్న సాంకేతిక చర్యలపై అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే, రైతులకు సాగునీరు త్వరితగతిన అందేలా పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ పినపాక నియోజకవర్గ వ్యవసాయ రంగానికి జీవనాడిగా నిలుస్తుంది. ప్రతి ఎకరాకు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అశ్వాపురం మండలంలోని సంద్రలబోడు, అమెర్ద గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాల చెరువులు, కుంటలకు సీతారామ ప్రాజెక్టు నీటిని అందించే విస్తరణ పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఆయా పనులు ప్రారంభించి గ్రామాలకు సాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పినపాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ఎమ్మార్వో, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, తుక్కాని మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్‌లు సబ్కా పిచ్చయ్య, మచ్చా నరసింహారావు, యేనిక ఉషారాణి, ఇర్పా కవిత, ఎట్టి నరేష్, కలివేటి సరిత, లంకమల్ల కొండలరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు వేములపల్లి రమేష్, బట్టా సత్యనారాయణ, ఎం.డి. షర్ఫుద్దీన్, కాకా రాములు, చుంచు ఏకాంబరం, కొమరం భాస్కర్, ఆవుల రవి, తెల్లం వీరభద్రం, రావులపల్లి వెంకటనర్సయ్య, తూము వీరరాఘవులు, రనబోతుల రామిరెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, యేనిక రవి, బరాజు సంపత్, తెల్లం నాగరాజు, మానాది వెంకన్న, రాగం మల్లయ్య, చెంచల రాము, మాదినేని సుబ్బారావు, వేముల విజయ్, రావులపల్లి నరసింహారావు, వాళ్ళు వెంకన్న, బొల్లు యాకయ్య, మురికిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ తొలి కౌన్సిల్ సమావేశం

- రూ.1 కోటి 97 లక్షల 77వేల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు




**మహా వరంగల్ బ్యూరో;** వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధ్యక్షతన నిర్వహించిన తొలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..వర్ధన్నపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ, ఇంజనీరింగ్, శానిటేషన్ పరిపాలనకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.1 కోటి 97 లక్షల 77 వేల నిధులకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ప్రతి వార్డు కౌన్సిలర్ తమ వార్డులో ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజల అవసరాలు, అభివృద్ధి ప్రతిపాదనలను సమావేశంలో వివరించగా, వాటిని ఎమ్మెల్యే నాగరాజు స్వయంగా నోట్ చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి వార్డు కౌన్సిలర్ తో సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని, సమావేశాల్లో చర్చకు వచ్చిన అంశాలపై వెంటనే చర్యలు తీసుకునే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి చేరి, వాటి పరిష్కారానికి సమయబద్ధంగా చర్యలు చేపట్టినప్పుడే స్థానిక సంస్థలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పలు కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం, రేషన్ సరఫరా అందిందా లేదా అనే అంశంపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం తప్పనిసరిగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అమృత్ పథకం కింద గతంలో తవ్విన పైపులైన్ల పనులను సమీక్షించిన ఎమ్మెల్యే నాగరాజు ఎక్కడైనా పనులు అసంపూర్తిగా ఉన్నా లేదా మరమ్మతులు అవసరమైన వాటిని వెంటనే పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ కార్యక్రమం ద్వారా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో దశలవారీగా అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సొంత ఇంటి కల నెరవేరేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వర్ధన్నపేట టౌన్ నుంచి పట్టణ శివారు వరకు ఏర్పాటు చేసిన డివైడర్ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ప్రజల సూచనలు, అభిప్రాయాలు, రాకపోకల అవసరాలను పరిగణనలోకి తీసుకుని డివైడర్లలో అవసరమైన మార్పులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. వర్ధన్నపేట పట్టణానికి మున్సిఫ్ కోర్టు మంజూరు కావడం చారిత్రాత్మక పరిణామం అని పేర్కొన్న ఎమ్మెల్యే నాగరాజు గారు, త్వరలో కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కోర్టుకు వచ్చే ప్రజలు, న్యాయవాదులు, సిబ్బందికి ఎలాంటి రాకపోకల ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా జడ్జి సూచనలు, అవసరాల మేరకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.మున్సిపాలిటీలో ఉద్యోగుల కొరత కారణంగా పారిశుద్ధ్య నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా అవుట్ సోర్సింగ్ విధానంలో 10 మంది సిబ్బందిని నియమించేందుకు కౌన్సిల్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. పట్టణ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా వర్ధన్నపేట పట్టణంలోని పండ్లు, కూరగాయల క్రయ విక్రయ మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సంబంధిత విధివిధానాలను పరిశీలించి మార్కెట్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించినట్లు తెలిపారు. మార్కెట్ పూర్తయితే రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.చివరగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమానంగా అమలయ్యేలా చూడాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే వర్ధన్నపేట ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దగలమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ, పట్టణ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లికీమా, మలోత్ దేవేందర్ తిరుపెల్లి వాణి కుమారస్వామి, భూక్యా సునీత, గుజ్జ వీరన్న, చిలువేరు రమ, తుమ్మల అరుణ, తిరుపతి సురేష్, సిలువేరు కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ జోనా, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల భద్రతే పోలీసుల కర్తవ్యం

- మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు
- తప్పిపోయిన చిన్నారిని తల్లికి అప్పగించిన మట్వాడ పోలీసులు

**మహా వరంగల్ క్రైం;** వరంగల్ నగరంలోని గిర్మాజిపేట ప్రాంతానికి చెందిన 6 సంవత్సరాల చిన్నారి ఇంటి నుండి తప్పిపోయి కనిపించకుండా పోయింది. ములుగు రోడ్డు లో ఆ చిన్నారిని బీసీఎస్ కానిస్టేబుల్ గుర్తించారు. చిన్నారి తన వివరాలు చెప్పలేక పోవడంతో, బీసీ ఎస్ కానిస్టేబుల్ నరేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆమె నివాసాన్ని గుర్తించి కుటుంబ సభ్యులను సంప్రదించారు.మట్వాడ ఎస్సై జెడ్. రాజేందర్ సమక్షంలో చిన్నారిని ఆమె తల్లికి సురక్షితంగా అప్పగించారు. తమ బిడ్డను క్షేమంగా అప్పగించినందుకు చిన్నారి తల్లి పోలీసు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు.చిన్నారిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేర వేసిన కానిస్టేబుల్ నరేష్, ఎస్సై జెడ్. రాజేందర్ లను ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తో పాటు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# హుస్సేనాబాద్ కేజీబీవీని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి జూన్ 16 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన అడ్మిషన్ల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని కొత్త అడ్మిషన్లు వచ్చాయని , విద్యార్థినుల హాజరు శాతం ఎలా ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. రిపేర్ పనులు నెమ్మదిగా సాగుతున్న విషయంపై ఆరా తీసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.పాఠశాల స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పు కూరగాయలునాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వంట నూనె ప్యాకెట్లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించి, కాలపరిమితి ముగిసిన వస్తువులు వినియోగించరాదని సూచించారు.పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# అర్హులైన న్యాయవాదులందరికీ ఆరోగ్య బీమా కార్డులు ఇవ్వాలి

- జూన్ 20న జరిగే న్యాయవాదుల ధర్నాను జయప్రదం చేయాలి – ఏఐఎల్‌యూ కరపత్రం విడుదల

**మణుగూరు, జూన్ 16:** రాష్ట్రంలోని అర్హులైన న్యాయవాదులందరికీ ప్రభుత్వం వెంటనే ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న న్యాయవాదుల ధర్నాను విజయవంతం చేయాలని A (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ - ఏఐఎల్‌యూ) నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళవారం మణుగూరులో ఏఐఎల్‌యూ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయ వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్నప్పటికీ, వారి సంక్షేమం విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన జూనియర్ న్యాయవాదులు, అర్హులైన అడ్వకేట్లకు ఆరోగ్య బీమా సదుపాయం అత్యవసరమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడైన న్యాయవాదికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ఆరోగ్య బీమా కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ నెల జూన్ 20న నిర్వహించనున్న న్యాయవాదుల ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మణుగూరు ప్రాంత న్యాయవాదులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐలు బి కిషన్ రావు, పోశం భాస్కర్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, బార్ అసోసియేషన్ సభ్యులు జాడి చొక్కయ, కందిమల్ల నరసింహారావు, మధు, బిక్కసాని శ్రీనివాస్, గద్దల సాంబ, రాము, నాగార్జున రెడ్డి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలంలో కోటిన్నర వ్యయంతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

**నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం**

**దమ్మపేట ,మహా :** కోటిన్నర రూపాయల వ్యయంతో దమ్మపేట మండలంలో పలు అభివృద్ధి పనులను అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ మంగళవారం ప్రారంభోత్సవాలు జరిపారు.అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మండలంలో రూ.1,20,80,000 విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, రవాణా, చిన్నారుల సంక్షేమ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడనున్నాయని జారె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంకంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిసెలగూడెంలో టిడబ్ల్యూయూపీఎస్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు .అనంతరం పట్వారిగూడెం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. బాలరాజుగూడెం గ్రామపంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడను ,మొండివర్రె లో రూ.11.80 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు .నాగుపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఆధునిక అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి చిన్నారుల విద్య పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తొట్టిపంపు గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ,లింగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెగుట్ట గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడలను ప్రారంభించారు, అలాగే మారప్పగూడెం గ్రామపంచాయతీ కొత్తూరులో రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ,పాత చీపురుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని ,పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను అందుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన భద్రతా ప్రమాణాల మెరుగుదల విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత పిల్లలు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగడం మనందరి బాధ్యతని అన్నారు.



ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రోడ్లు ,విద్యాసంస్థలు ,అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో మండల అధికారులు ,కాంగ్రెస్ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్ ,మార్కెట్ యార్డు చైర్మన్ వాసం రాణి , ంచాయతీ సర్పంచ్ లు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రోగులకు షాక్..

- ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రద్దు..
- రద్దు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి..
- టిబిజీకేఎస్ నేత నాగెల్లి వెంకటేశ్వర్లు



**మణుగూరు, మహా :** సింగరేణి కార్పొరేట్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ప్రతి నెల రెండు ఆదివారాలు కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు హాజరయ్యే రోగులు, వారితో పాటు వెళ్లే ఎస్కార్ట్‌లకు ఇప్పటివరకు అందిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను ఈ నెల నుంచి రద్దు చేయడం అన్యాయమని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టిబిజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మణుగూరు ఏరియా నుంచి ప్రతి క్యాంప్‌కు సుమారు 60 నుంచి 70 మంది రోగులు కొత్తగూడెం ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను రద్దు చేయడం వల్ల కార్మికులు, రోగులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోగులు తమ సమస్యలను నాగెల్లి వెంకటేశ్వర్లుకు వివరించారు. మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, 2డీ ఎకో టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండటంతో పరీక్షలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అలాగే ల్యాబ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడం, ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రిఫరల్ ద్వారా హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకుని అక్కడి వైద్యులు సూచించిన మందులు స్థానిక ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, అవసరమైన టాబ్లెట్లు, ఇంజెక్షన్లు నిరంతరం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోగులు ప్రస్తావించిన అన్ని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని నాగెల్లి వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిగేల నాగేశ్వరరావు, దాసరి కృష్ణ, మొగిలి రాజయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో సమర్థవంతంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, మహా :** జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తామని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఛాంబర్ లో కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికీ వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ముందు ఉండాలని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. జాతీయ కీటక జనిత వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మాత శిశు సంరక్షణ టీకాల కార్యక్రమం, కీటక జనిత వ్యాధులు నివారణ, అసంక్రమణ వ్యాధులు, క్షయ వ్యాధి నియంత్రణలో ముందస్తు చర్యలతో పాటు జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.

# హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

- ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే
- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**హనుమకొండ, మహా :** ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్ల సింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొనవద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదన్నారు. గుండ్ల సింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, కొట్టే వెంకటేష్, వేల్పుల సారంగపాణి, అనుకారి అశోక్, రాసమల్ల దినా, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదాసి కళ్యాణ్, గాదె రాజన్న, కట్కూరి కృష్ణ, జన్ను కృష్ణ, నాయకులు పోనుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు గద్దం రాజనర్సు, రోంటాల శ్యామ్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ పాటలు, మహిళల కోలాట నృత్యం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# పట్టణ సుందరీకరణ అందరి బాధ్యత

- డ్రైనేజీ ఆక్రమణలతో పంచాయతీ ఆదాయానికి గండి.
- విద్యుత్ కనెక్షన్ లు ఎలా సాధ్యం.
- నిబంధనలు కొందరికే స్వంతమా...?

**దమ్మపేట ,మహా :** అక్రమార్కులు పలువురు కలిసి గొల్లుమంటే ..నిబంధనలు మారతాయా....? ప్రభుత్వానికి అందరూ సమానులే కదా... ఒకరికి ఒక విదమైన చట్టం ,మరొకరికి మరో విదమైన చట్టం రాజ్యాంగ లో పొందుపరిచారా....? రోజంతా వ్యాపారం చేసుకొని సాయంత్రం షాపు తీసేసే వారితో ఎలాంటి ఇబ్బందులు లేవు కదా. మరి ఇబ్బందులు ఎక్కడ వస్తున్నాయంటే శాశ్వతంగా డ్రైనేజీ ల పైనే నిర్మాణం చేపట్టి స్వంత షాపుల మాదిరిగా చెలామణి అయ్యే వారితోనే ఇబ్బందంతా....పంచాయతీ చట్టం ఏమి చెబుతుందో అది అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల మీద ,ప్రజా ప్రతినిధుల పైనా ఉందా...? లేదా...? డ్రైనేజీలు రోడ్డుకు మరొక వైపున ఆక్రమణలు లేవు కదా... మరి రోడ్డుకు ఒక వైపు మాత్రమే ఎలా ఆక్రమణ చేశారు...? వీటన్నింటిని అధికారులు ఆలోచించాల్సి ఉంది. ఒక ప్రకటనలో అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ మండల కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత నాది అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న విషయం విదితమే కదా. మరి అటువంటప్పుడు డ్రైనేజీలే శుభ్రపరిచే పరిస్థితి లేకపోతే ,సుందరీకరణ మాట సంగతేంటి...?

**ప్రక్కనే ఉన్న మండల కేంద్రాలకంటే ఎక్కువా...?**

ప్రక్కనే ఉన్నటువంటి అశ్వారావుపేట ,ములకలపల్లి మండల కేంద్రాలలో రోడ్లు వెడల్పుల బాగంలో రోడ్ల పైన ఉన్న షాపులను తొలగించలేదా...? అక్కడ ఆర్ అండ్ బి అధికారులు ,ప్రజాప్రతినిధులు పనిచేసినప్పుడు ఈ మండలానికి ఏమైంది...? రోడ్లను క్రమబద్ధీకరించాలంటే ....ఆక్రమణ దారుల అనుమతులు అవసరమా...? లేక ప్రభుత్వ నిబంధనలు అవసరమా...? అధికారులు ఆలోచించాల్సి ఉంది.

**ఎవరికోసం ఉపేక్ష :**

పిల్లి గ్రుడ్డిదైతే ఎలుక ఎక్కిరించిందనే మొరటు సామెత గురించి పాఠకులు వినేఉంటారు. అధికారులు చేయాల్సిన పని అధికారులు చేయకుండా ,ఎవరో కొందరి స్వార్ధ ప్రయోజనాల కోసం కోట్ల రూపాయల తో చేసిన అభివృద్ధి పనులను మూలన పడుకోబెట్టడం సహేతుకమేనా....? పోలీసులు , ఆర్ అండ్ బి శాఖ ,పంచాయతీ అధికారులు , తలుచుకుంటే రోడ్లను కాపాడుకోలేమా....? ఎందుకు ఉపేక్ష వహిస్తున్నారు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపైన అవకాశాలు ఇస్తే అందరికీ ఇస్తూ సమాన న్యాయం చేయాలని కోరుతున్నారు. ఒక వైపున అద్దెలు కట్టలేక ఇబ్బందులు ,మరొక వైపున ఎటువంటి అద్దెలు లేకుండా ,ఎంజాయ్ చేస్తూ బాహాటంగా రోడ్లపైనే వ్యాపారాలు ...ఎందుకు ఈ వివక్ష అంటూ వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

**విద్యుత్ కనెక్షన్ లు ఎలా...?**

రోడ్లపైన ,ఫుట్ పాత్ లపైన చిరు వ్యాపారులకు ఏకంగా విద్యుత్ కనెక్షన్ లు ఇవ్వడం ఎలా సాధ్యం...? పక్కాగా షాపు నిర్మాణం చేసుకున్న వారికి విద్యుత్ మీటరు ఇవ్వలంటేనే ఎన్నో నిబంధనలు చెబుతున్నారు.

మరి డ్రైనేజీ లపైన పనిచేసుకునే వ్యాపార వర్గాలకు విద్యుత్ సరఫరా ఎలా ఇస్తున్నారో విద్యుత్ శాఖాధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది.

**డ్రైనేజీ ల పై షాపులు లీజుకు ఇస్తూ దందా...**

డ్రైనేజీ లపై కొందరు ఆక్రమణ చేసుకొని వాటిని తిరిగి మరొకరికి లీజుకు ఇస్తూ అక్రమ దందాలు కొనసాగిస్తున్నట్లుగా సమాచారం. మరి ఈ విషయం పై ఎవరైతే కార్మికుల పొట్ట కొడుతున్నారని ఎమ్మెల్యేకి వినతి పత్రాన్ని అందించారో ,వారికి తెలియదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కొంతమంది వివిధ ప్రజా పోరాటాలు చేస్తూ ప్రజలకు చేరువ కావాలనే ఆతృత లో ప్రభుత్వ నిబంధనలు గుర్తుంచుకోరా...? ఎవరంతట వారే స్వచ్ఛందంగా డ్రైనేజీలు శుభ్రపరుచుకుంటూ , చిరు వ్యాపారులు సాగిస్తున్న వారి పై ప్రభుత్వం దయచూపాలని ఎమ్మెల్యే ని కలిసిన వారిలో ఎంతమంది డ్రైనేజీలు శుభ్రం చేశారో పంచాయతీ అధికారులకు తెలియజేస్తే బావుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**పంచాయతీ ఆదాయానికి గండి :**

చిరు వ్యాపారాలు చేసుకునే వారు పంచాయతీ ప్రదేశంలో పెట్టుకుంటే ,అటు పంచాయతీ కి ఆదాయం వస్తుంది . ట్రాఫిక్ కు అంతరాయం ఉండదు. ప్రధాన రహదారి కి ప్రక్కన పాత సంతపాకల స్థలంలో షెడ్డులు నిర్మించి చిరువ్యాపారులకు ఇస్తే పంచాయతీ ఆదాయం పెరిగే అవకాశం లేకపోలేదు. అదేమీ లేకుండా దౌర్జన్యం గా ఆక్రమణలు చేస్తూ ,ప్రక్కవారిపైన హుకుం జారీ చేస్తూ రోడ్లను ఆక్రమించడం పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. విద్యుత్ మీటరు ఉన్న వారేమో మరొకరికి విద్యుత్ ఇస్తూ సొమ్ములు గుంజుతున్నారు. మరికొందరైతే షాపుకు సరిపడు స్థలం ఆక్రమించుకొని ,దానిని మరలా ఇతరులకు లీజు పేరుతో అద్దెలు వసూళ్లు చేస్తున్నారు. ఆనాడే డ్రైనేజీ లపై వద్దని , తొండ ముదిరితే ఊసరవెల్లి ఐన చందంగా మొదట షాపులు పెట్టుకుని అద్దెలు ఇస్తామని చెప్పిన చిరు వ్యాపారులు ,నేడు కార్మికుల మంటూ పోరాడే స్థాయికి ఎదిగారంటే పాలకులు ఆలోచన చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు మొద్దునిద్ర వీడి ,నిబంధనల మేరకు చర్యలు తీసుకోకపోతే ప్రతి ఒక్కరూ రోడ్లపైనే బాహాటంగా వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.



## బహదూర్ గూడ ప్రభుత్వ భూములను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని బహదూర్ గూడ రెవెన్యూ పరిధి లోని సర్వే నెంబర్ 28, 62,లో ఉన్న ప్రభుత్వ భూములను హైడ్రాధికారులతో కలిసి రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీధర్ పరిశీలించారు. బహదూర్గుడలో ఎక్కడెక్కడ ఏ ఏ సర్వే నంబర్లు ప్రభుత్వ భూములు ఉన్నాయో క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు.



## పాఠశాలలో పారిశుధ్య లోపంపై కలెక్టర్ సీరియస్

- విశ్వనాథపల్లి పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం విశ్వనాథపల్లి ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కలెక్టర్ పరిశీలిస్తున్న తరుణంలో కుళాయిల ద్వారా నీరు వృథాగా పోతుండడం, మరుగుదొడ్ల పరిశుభ్రత సరిగా లేకపోవడం, శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం కనిపించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ, మరమ్మతులు, పారిశుద్ధ్య పనుల కోసం ప్రభుత్వం ప్రతి నెలా నిధులు ఇస్తున్నా వాటిని సమర్థవంతంగా వినియోగించడంలో నిర్లక్ష్యం వహించడం పై అగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్, సర్పంచ్ ఇస్లావత్ రాజు తదితరులు ఉన్నారు.



## బిజెపి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం
- నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ, టాటా నగర్ లలో సమస్యలపై బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి మంగళవారం బస్తీలో పర్యటించారు. భూగర్భం డ్రైనేజీ వ్యవస్థ పైప్ లైన్లు పెండింగ్ లో ఉన్న నూతన సిసి రోడ్, ప్యాచ్ వర్క్ త్రీఫేస్ ఎలక్ట్రిక్ లైన్ సమస్యలపై బస్తి వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజ్ పనులు వీలైనంత తొందరగా నూతన సిసి రోడ్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. డ్రైనేజీ సిసి రోడ్ సమస్యలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. బిజెపి నాయకులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్, సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్, దయానంద్, సాయిలు, నరేష్, శారదా, విశ్వనాథ్, ఏ రమేష్, కాళిదాస్, నికిత, సతీష్, కొండప్ప, అర్జున్, రమేష్ యాదవ్, మల్లికార్జున్, శివరాజ్, వీరశెట్టి, రాజ్ కుమార్, కిరణ్ ప్రశాంత్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



## చదువుకోవాల్సిన చిన్నారులు, కంపెనీలలో కార్మికులుగా చేరారు

**రాజేంద్రనగర్ మహా ;** కాటేదాన్ డివిజన్ పరిధిలో హైస్కూల్లో సీట్ల కొరత కారణంగా ప్రైమరీ స్కూల్లో చదివిన విద్యార్థిని విద్యార్థులు బడిబాట పట్టాల్చిన విద్యార్థులు ఫ్యాక్టరీ లలో బాల కార్మికులుగా చేరుతున్నారనికాటేదాన్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్లో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు చదివిన విద్యార్థిని విద్యార్థులకు ఆరవ తరగతిలో చేరడానికి హైస్కూల్లో సీటు దొరకటం లేదని, హై స్కూల్లో ఖాళీలు లేవని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు.. రెక్కా డితే కానీ డొక్కాడని పేద ప్రజలు ఉన్న కాటేదాన్ డివిజన్లో వారి పిల్లలు 5వ తరగతి వరకు ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో చదివిన వారికి హైస్కూల్ ఆరవ తరగతి ప్రవేశం కొరకు సీట్లు లేవనటము



బాధాకరమన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించే స్తోమత లేక వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ గాడి దప్పిందాన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బడిబాట, మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా ఎంతో మందిని విద్యార్థిని విద్యార్థులను స్కూల్లో చేర్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుందన్నారు.

## మహిళలు డిజిటల్ లావాదేవీల పై అవగాహన పెంపొందించు కోవాలి

- డిజిటల్ లావాదేవీలను సద్వినియోగం చేసుకోవాలి
- బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- వివిధ సమాఖ్యలకు పీఓఎస్ యంత్రాలు అందజేత



**మహా వరంగల్ కార్పొరేషన్:** పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలను సద్వినియోగం చేసుకుని డిజిటల్ లావాదేవీల పై అవగాహన పెంపొందించు కోవాలని బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమాఖ్యలకు పీఓఎస్ యంత్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటలైజేషన్ ను ప్రోత్సహించేందుకు స్త్రీ నిధి ఆధ్వర్యంలో సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలకు ఉచితంగా పీఓఎస్ యంత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా సభ్యులు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్త్రీ నిధి రుణాల చెల్లింపులు చేయడంతో పాటు వెంటనే రసీదు పొందవచ్చని చెప్పారు.పీఓఎస్ యంత్రాల ద్వారా స్త్రీ నిధి రుణాలను సులభతరంగా, పారదర్శకంగా చెల్లించు కోవచ్చని పేర్కొన్నారు. ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ప్రస్తుతం హనుమకొండ పరిధిలో 56, వరంగల్ పరిధిలో 45 పీఓఎస్ యంత్రాలను పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో అన్ని సమాఖ్యలకు ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పీఓఎస్ యంత్రాల వినియోగం పై సభ్యులు సాంకేతిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.బ్యాంక్ లింకేజీలు, రుణాల వసూళ్లు, నాన్‌పర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పీఏ) తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.

**స్త్రీ నిధి రుణాల అమలులో నగరం ప్రథమ స్థానం**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో స్త్రీ నిధి రుణాల అమలులో నగరం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈసారి జాతీయ స్థాయిలో కూడా అవార్డు సాధించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణాల ప్రయోజనాలను కేవలం రెగ్యులర్ స్వయం సహాయక సంఘాలకే పరిమితం చేయకుండా ఇతర అర్హులైన గ్రూపులకు కూడా విస్తరించాలని, మరింత మంది మహిళలను ఆర్థిక సాధికారత దిశగా ముందుకు తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆర్‌పీలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ సైదిరెడ్డి, మేనేజర్ కపిల్, టీఎంసీ రమేష్, అసిస్టెంట్ మేనేజర్లు వెంకట్, సుప్రియ, సతీష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రవీణ్, రజిత, శ్రీలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## వేగవంతంగా డీసిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

**బల్దియా ప్రత్యేక అధికారి,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**మహా వరంగల్ కార్పొరేషన్;** గ్రేటర్ వరంగల్ నగరంలో వేగవంతంగా డీసిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని బల్దియా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హన్మకొండ పరిధి లోని జవహర్ కాలనీ, ప్రెసిడెంట్ స్కూల్, రాజాజీ నగర్, నయీమ్ నగర్ ప్రాంతాలలోని నాలాలను ప్రత్యేకాధికారి నేరుగా పరిశీలించి సమర్థవంతంగా పూర్తి చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసిల్టేషన్ పూర్తి చేసుకున్న నాలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మాట్లాడుతూ కొద్ది స్థాయి లో డీసిల్టేషన్ పెండింగ్ లో ఉన్న ప్రాంతాల్లో కూడా వెంటనే పూర్తి చేయించి, అవసరమున్న ప్రాంతాలలో లోతుగా డీసిల్టేషన్ చేయించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఈ ఈ రవి కుమార్, పాల్గొన్నారు.

# మార్కెట్లో రైతుల పై ఆర్థిక భారాన్ని తగ్గించాలి

- సమస్యలపై మార్కెట్ కమిటీ చైర్మన్ కు మెమొరాండం అందజేత
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్



**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర ప్రియాంక కు ఏనుమాముల మార్కెట్, లక్ష్మిపురం పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్ సమస్యల పై మెమొరండాన్ని సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ రైతులు పంటలు పండించడం మరొక్క ఎత్తు పండిన పంటను మార్కెట్ లో అమ్ముకోవడం లో ఇబ్బందులకు గురి అవుతున్నారు. పంటను మార్కెట్కు తీసుకువచ్చిన సమయంలో పంటకు రక్షణ కల్పించకపోవడం వర్షాలకు పంట నానే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా మార్కెట్కు తీసుకొచ్చిన పంటకు సరైన ధరను అందించకపోవడం అనేక రకాల ఖర్చు ఖర్చులు రైతు నుండి తీయడం కారణంగా వరంగల్ మార్కెట్ కు రైతులు పంటను తీసుకురాకుండా గ్రామాలలో ప్రైవేటు వ్యాపారస్తులకు తెగను అమ్ముకోవడం జరుగుతుంది దీని మూలంగా మార్కెట్ కు వచ్చే ఆదాయం రాకపోవడం పంటలు రాక మార్కెట్ వెలవెల పోవడం జరుగుతుంది. రైతుల పంటను మార్కెట్ కు రావాలంటే రైతులపై ఖర్చుల భారాన్ని తగ్గించాలి పంటలకు సరైన ధర వచ్చే విధంగా చూడాలి మార్కెట్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని మెమోరండంలో చైర్మన్ కు హాలో అంశాలను తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా రైతు మార్కెట్ కు పంటను తీసుకొచ్చినప్పుడు ఎలాంటి ఖర్చులు రైతులపై పడకుండా మార్కెట్ కమిటీ భరించాలని మార్కెట్లలో రైతుకు ఉచిత టిఫిన్, భోజనం ఏర్పాటు చేయాలని అలాగే మార్కెట్ ను ఆనుకొని ఉన్నటువంటి 37 గుంటల స్థలంలో కాంప్లెక్స్ నిర్మించి అందులోనే రైతు విశ్రాంతి భవనం, రైతులు పంటలపై, మార్కెట్ చట్టాలపై అవగాహన కల్పించే విధంగా వ్యవసాయ శాస్త్రవేత్తల చే శిక్షణ తరగతులు ఇప్పించాలని ముఖ్యంగా వరంగల్ సిటీని ఆనుకొని 30 ఎకరాలు స్థలాన్ని కొనుగోలు చేసి పండ్ల మార్కెట్ ను ఆధునిక పద్ధతిలో నిర్మాణం చేయాలని అంతేకాకుండా లక్ష్మిపురం కూరగాయల మార్కెట్ ను ఆనుకొని రైతులు తీసుకువచ్చిన పంటను స్వేచ్ఛగా అమ్ముకొని పోయే విధంగా ఒక్క ఎకరం స్థలం రైతులకు కేటాయించాలి, మార్కెట్ ఆవరణంలో ఉన్నటువంటి గద్దె లను తొలగించి విశాలంగా ఉండే విధంగా ఉండాలి ఇంకా మరికొన్ని పంటలు అమ్ముకునే విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాల పై కూడినటువంటి మెమోరండాన్ని చైర్మన్ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పైన తెలిపిన అంశాల తో రైతులకు ఎదురవుతున్న సమస్యలు వాస్తవమే! వీటిని 60 రోజుల్లోనే కొన్ని సమస్యలు పరిష్కరించే విధంగా నా వంతు ప్రయత్నం కొనసాగిస్తానని హామీని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి జనార్ధన్ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్ గాజుల శ్యామ్ తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు ఊరటి అంశాలరెడ్డి జిల్లా కమిటీ సభ్యులు మోకిడ పీరయ్య బరపటి రవీందర్ సోమిడి సాంబయ్య, బొల్లు ఎల్లయ్య మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తాం...

- డ్రైవర్ తో పాటు యజమానులపై కేసులను నమోదు చేస్తాం
- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అవినాష్

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండో రోజు స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించారు.రాజేంద్రనగర్, ఆరంగర్, డైరీ ఫార్మ్ ,కాటేదాన్, బండ్లగూడలో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో ఫిట్నెస్ లేని పాఠశాలల బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు.తెలంగాణ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుండి స్కూల్ బస్సుల పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూనిబంధనకు విరుద్ధంగా రోడ్డుపై తిరుగుతున్న బస్సులను రవాణా శాఖ అధికారులు పలు బస్సులను సీజ్ చేశారు. ఫిట్నెస్ లేకుండా రోడ్డుపై బస్సులు తిరిగితే వాటిని సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నక్ష కార్యక్రమం అమలును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న నక్ష కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వర్ధన్నపేట మునిసిపల్ పరిధి లోని 6 వార్డు లోని నివాస గృహాలను వ్యవసాయ భూములలో జరుగుతున్న నక్ష క్షేత్ర స్థాయి లో జరుగుచున్న పనులను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నక్ష కార్యక్రమం ద్వారా భూ వివరాల నమోదు సక్రమంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ క్షేత్ర స్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్ రావు,వరంగల్ ఆర్డీవో సుమ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## పెస్టిసైడ్స్ దుకాణం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా కమలాపురం మండలం అంబాల గ్రామంలోని శ్రీరామ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం పై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు.విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో సుమారు రూ.57,665 విలువైన గడువు ముగిసిన పురుగుమందులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని యజమాని కుక్కల ప్రభాకర్ పై కేసు నమోదు నిమిత్తం కమలాపురం పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

# జీతం రాగానే ఆవిరైపోతుందా? బడ్జెట్ ప్లాన్ ఇలా చేస్తే సేవింగ్స్ పక్కా

నెల చివరికి వచ్చేసరికి మీ జేబు ఖాళీ అవుతుందా? ఆర్థిక సమస్యల నుండి బయట పడటానికి అత్యంత ప్రభావవంతమైన '5030 20' ఆర్థిక నియమం గురించి మీకు తెలుసా? ఆర్థిక స్థిరత్వాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన మ్యాజిక్ ఫార్ములా ఇది! మీ ఆదాయాన్ని తెలివిగా ఖర్చు చేస్తూనే, భవిష్యత్తు కోసం ఎలా పొదుపు చేయాలో తెలుసుకుందాం..

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పెరుగుతున్న జీవన వ్యయాలు, రుణాలు మరియు జీవనశైలి ఖర్చుల కారణంగా చాలామంది నెల చివరికి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేతికి వచ్చిన జీతం నెల మధ్యలోనే అయిపోవడం, పొదుపు చేయడానికి మార్గం కనిపించకపోవడం అనేది నేటి మధ్యతరగతి ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య. అయితే, మీ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేసి, భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఒక అద్భుతమైన మార్గం ఉంది, అదే '503020 నియమం'.

### ఏమిటీ 50-30-20 నియమం?

ఈ ఆర్థిక ప్రణాళిక ప్రకారం, మీ నెలవారీ ఆదాయాన్ని మూడు స్పష్టమైన భాగాలుగా విభజించుకోవాలి. 50% అవసరాల కోసం ఇందులో ఇంటి అద్దె, కిరాణా సరుకులు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులు మరియు తప్పనిసరిగా చెల్లించాల్సిన EMIలు వంటి నిత్యావసరాలు ఉంటాయి.30% కోరికల కోసం ఇది మనం సంతోషంగా జీవించడానికి చేసే ఖర్చులు. షాపింగ్, బయట భోజనం, సినిమాలు, పర్యటనలు మరియు ఇతర వినోద కార్యక్రమాల కోసం ఈ మొత్తాన్ని కేటాయించాలి.20% పొదుపులు & పెట్టుబడుల కోసం ఇది భవిష్యత్తు కోసం చేసే కేటాయింపు. బ్యాంక్ సేవింగ్స్, SIPలు, మ్యూచువల్ ఫండ్లు మరియు అదనపు రుణాల చెల్లింపుల కోసం ఈ భాగాన్ని వినియోగించాలి.

### ఎలా అమలు చేయాలి?

ముందుగా మీ నెలవారీ ఆదాయాన్ని లెక్కించండి. ఆ తర్వాత పైన పేర్కొన్న నిష్పత్తిలో మీ ఖర్చులను విభజించండి. ఒకవేళ మీ అవసరాల ఖర్చు 50 శాతాన్ని మించుతుంటే, వెంటనే ఆ ఖర్చులను తగ్గించుకునే మార్గాలను అన్వేషించండి. పొదుపు అలవాటును పెంపొందించుకోవడానికి, నెల మొదట్లోనే ఆటోమేటిక్ డెబిట్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ఉత్తమం. ఇది అనవసరపు ఖర్చులను అడ్డుకోవడంలో మీకు తోడ్పడుతుంది.

### ఈ నియమం ఎలా పనిచేస్తుంది?

ఉదాహరణకు, మీ నెలవారీ ఆదాయం రూ. 1,00,000 అయితే, రూ. 50,000 అవసరాలకు, రూ. 30,000 కోరికలకు, రూ. 20,000 పొదుపుకు కేటాయించాలి. ఇలా చేయడం వల్ల మీరు జీవితాన్ని సంతోషంగా ఆస్వాదిస్తూనే, మరోవైపు ఆర్థిక భద్రతను కూడా పొందుతారు. దీనివల్ల ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది, అనవసరపు వ్యయాలు తగ్గుతాయి మరియు భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి స్పష్టమైన ప్రణాళిక సిద్ధమవుతుంది. మీరు ఉద్యోగ జీవితాన్ని ఇప్పుడే మొదలుపెట్టిన వారైనా లేదా ఆర్థిక స్థిరత్వం కోరుకునే వారైనా, 503020 నియమం ఒక స్నేహితుడిలా మీ డబ్బును సరైన దిశలో నడిపిస్తుంది. ఇది సులభమైన పద్ధతి మాత్రమే కాదు, దీర్ఘకాలంలో అత్యంత ప్రభావవంతమైన ఆర్థిక ప్రణాళిక. మీ ఆర్థిక ప్రయాణాన్ని ఈరోజే క్రమబద్ధం చేసుకోండి, నిశ్చింతగా భవిష్యత్తును నిర్మించుకోండి!



# ఒక్క వాట్సాప్ మెసేజ్.. ఐటీ ఇంటర్న్‌పై వేటు!

ఐటీ రంగంలో కొన్ని స్టార్టప్‌ల పనితీరు, ఇంటర్న్‌ల పట్ల యాజమాన్యాల ధోరణిపై సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం ఒక చర్చ వైరల్ అవుతుంది. కేవలం అర్హతకు తగ్గ వేతనం (స్టైపెండ్) పెంచాలని వాట్సాప్‌లో మెసేజ్ పంపినందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌ను తొలగించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో నా ఇంటర్న్‌షిప్‌ను రద్దు చేశారు.. అంటూ సదరు టెక్కీ సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్ట్ ఐటీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



### కంపెనీ భారాన్ని మోసి.. చివరకు..

బాధిత టెక్కీ కథనం ప్రకారం.. ఆమె ఒక చిన్న స్టార్టప్ కంపెనీలో ఏఐ ఇంజినీర్ ఇంటర్న్‌గా చేరారు. ఆరు నెలల కాలపరిమితి గల ఈ ఇంటర్న్‌షిప్‌లో ఆమెకు అత్యంత స్వల్ప మొత్తాన్ని స్టైపెండ్‌గా నిర్ణయించారు. ఆ స్టార్టప్ సాంకేతిక విభాగంలో ఉన్న ఏకైక వ్యక్తి ఆమే కావడం గమనార్హం. ఒక ఇంటర్న్ అయినప్పటికీ, సంస్థ కోసం ఆమె నిత్యం శ్రమిస్తున్నారు.కంపెనీకి సంబంధించిన పూర్తి స్థాయి స్మాల్ లాంగ్వేజ్ మోడల్ (ఎస్ఎల్ఎం)ను ఆమే స్వయంగా అభివృద్ధి చేశారు. సిస్టమ్ సామర్థ్యాన్ని మెరుగుపరిచి జాప్యం (Latency) తగ్గించేలా కోడింగ్‌ను ఆప్టిమైజ్ చేశారు. ఆమె ప్రతిభ కారణంగా సదరు స్టార్టప్‌కు ఏకంగా ఏడుగురు కొత్త క్లయింట్లు వచ్చారు. మూడు నెలల విజయవంతమైన పనితీరు తర్వాత ఆన్‌బోర్డింగ్ సమయంలో యాజమాన్యం ఇచ్చిన మాట ప్రకారం స్టైపెండ్ రివిజన్ కోసం ఆమె మేనేజర్‌కు వాట్సాప్‌లో ఒక మెసేజ్ పంపారు.

### వాట్సాప్ సందేశంలో ఏముందంటే..

'హలో మేడమ్, నేను ఇక్కడ మూడు నెలలు పూర్తి చేసుకున్నాను. ఆన్‌బోర్డింగ్ సమయంలో మాట్లాడినట్లుగా నా స్టైపెండ్ రివిజన్ గురించి ప్రస్తావించాలనుకుంటున్నాను. గత 3 నెలల్లో నేను ఎస్ఎల్ఎం ఏజెంట్లను నిర్మించాను. వాటిని పరీక్షించాను. డెప్లాయ్ చేశాను. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నా స్టైపెండ్‌ను కొంత మేర(XXXX) పెంచుతారని ఆశిస్తున్నాను. దీనిపై మరింత చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అని రాశారు. కానీ, ఈ సాధారణ మెసేజ్‌ను మేనేజర్ జీర్ణించుకోలేకపోయారు. 'ఒక విద్యార్థికి ఇంత పెద్ద మొత్తంలో పెంపు ఇవ్వడం అసాధ్యం' అని కొట్టిపారేశారు. అంతటితో ఆగకుండా ఆమె రాత్రింబవళ్లు కష్టపడి చేసిన పనిని కేవలం 'టెస్టింగ్ క్యాంపెయిన్లు, టెస్ట్ క్లయింట్లు' అంటూ తక్కువ చేసి మాట్లాడారు. స్వతంత్రంగా పనిచేయడాన్ని కూడా ఒక తప్పుగా చూపించే ప్రయత్నం చేశారు.

### తర్వాత కొన్ని రోజులకు..

ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే సదరు ఇంటర్న్‌కు కంపెనీ నుంచి ఒక ఈమెయిల్ వచ్చింది. అంచనాలకు తగిన పని లేదనే నెపంతో ఆమె ఇంటర్న్‌షిప్‌ను తక్షణమే రద్దు చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా కంపెనీ సీఈఓ ఆమెకు దాదాపు 30 నిమిషాల పాటు స్టార్టప్ సంస్కృతిపై ఉచిత ఉపన్యాసం ఇచ్చి ఆమెను 'మనీమైండెడ్' అని సంబోధించారు. "నాలుగు నెలల పాటు కష్టపడి రాసిన కోడ్‌ను పూర్తిగా విస్మరించారు. 'మేము ఇంత మొత్తమే ఇవ్వగలం' అని వారు నేరుగా చెప్పి ఉంటే నేను సంతోషంగా అంగీకరించేదాన్ని. కానీ కేవలం చర్చలు జరిపినందుకు నన్ను తీసేశారు' అని టెక్కీ వాపోయారు. 'ప్రామాణిక వ్యాపార చర్చలను వ్యక్తిగత ద్రోహంగా భావించే నిర్వాహకుల కింద వేతనం కోసం నేను భిక్షం ఎత్తాలనుకోవడం లేదు. అందుకే నా ఎక్స్‌పీరియన్స్ లెటర్ కోసం డిమాండ్ చేస్తూ మెయిల్ పెడుతున్నాను' అని ఆమె చెప్పారు.

### నెటిజన్ల స్పందన

ఈ పోస్ట్ వైరల్‌గా మారడంతో ఐటీ నిపుణులు, నెటిజన్లు సదరు టెక్కీకి మద్దతుగా నిలుస్తున్నారు. కంపెనీల దోపిడీని ఎండగడుతూ పలువురు వ్యాఖ్యానించారు. 'కూల్‌గా ఉండండి.. మీ ప్రమాణాలను ఎప్పుడూ తగ్గించుకోవద్దు. మిమ్మల్ని కోల్పోవడం ఆ కంపెనీకే నష్టం' అని ఒకరన్నారు. 'నాకు కూడా ఇలాగే జరిగింది.కంపెనీ అవసరాలకు మించి ఎక్కువ పనులు చేయకూడదని దీని ద్వారా నేర్చుకున్నాను' అని మరొకరు చెప్పారు.

## డీజిల్, జెట్ ఇంధన ఎగుమతులపై
# విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంపు!

పశ్చిమాసియా యుద్ధం, అంతర్జాతీయ మార్కెట్లో మారుతున్న ముడిచమురు సమీకరణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. దేశీయంగా ఇంధన కొరత రాకుండా చూసేందుకు, ఎగుమతిదారులు అనవసర లబ్ధి పొందకుండా అడ్డుకట్ట వేసేందుకు డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. సవరించిన కొత్త ధరలు ఈరోజు నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తన అధికారిక నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. అయితే, సామాన్యుడిపై భారం పడకుండా దేశీయ వినియోగం కోసం సరఫరా అయ్యే పెట్రోల్, డీజిల్ ధరలపై ఎలాంటి సుంకాలు పెంచకపోవడం గమనార్హం.

### విండ్‌ఫాల్ ట్యాక్స్ అంటే..

ఏదైనా ఒక పరిశ్రమ లేదా కంపెనీ తమ సొంత కష్టం లేదా అదనపు పెట్టుబడి లేకుండా అనుకోకుండా మారిన అంతర్జాతీయ పరిస్థితులు లేదా బాహ్య కారణాల వల్ల భారీగా లాభ పడినప్పుడు (విండ్‌పాల్ గెయిన్స్) ఆ అదనపు లాభాలపై ప్రభుత్వం విధించే ప్రత్యేక పన్నునే విండ్‌ఫాల్ ట్యాక్స్ అంటారు.



### సవరించిన పన్నుల వివరాలు..

ఎగుమతులను నిరుత్సాహపరిచి, దేశీయ మార్కెట్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా కేంద్రం ఈ పన్నును సవరించింది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# సాఫ్ట్ వేర్, ఎంబీఏ శకానికి చరమగీతం?

భారతదేశ జాబ్ మార్కెట్‌లో దశాబ్దాలుగా నడుస్తున్న 'వైట్ కాలర్' ఉద్యోగాల బూమ్ ఇకపై సాగకపోవచ్చని, సాఫ్ట్‌వేర్, ఎంబీఏ డిగ్రీల హవా ముగింపు దశకు చేరుకుందని దేశ ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ వ్యాఖ్యలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో.. వెల్డింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, వడ్రంగి వంటి భౌతిక, వాణిజ్య నైపుణ్యాలకే (ట్రేడ్ స్కిల్స్) రాబోయే రోజుల్లో విపరీతమైన గిరాకీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పని స్వభావం, ఉద్యోగ నష్టాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సరికొత్త చర్చకు తెరలేపాయి.



### శ్రమకు దక్కని గౌరవం

'స్విట్జర్లాండ్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు, వృత్తి నిపుణులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుంది. కానీ భారతదేశంలో అది కరవైంది. వెల్డర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, వడ్రంగి వంటి వారిని మనం తక్కువ చేసి చూస్తాం. వారి వృత్తులను అగౌరవంగా, ఫ్యాషన్ కానిదిగా మార్చేశాం. ఈ ఆలోచనా విధానం తక్షణమే మారాల్సిన అవసరం ఉంది' అని అనంత నాగేశ్వరన్ అన్నారు. సాంకేతిక పురోగతి అనేది ఉపాధిని పూర్తిగా హరించబోదని, అయితే అది ఉద్యోగాల స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తుందని నాగేశ్వరన్ విశ్లేషించారు. గతంలో ప్రపంచీకరణ వల్ల భారత సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ విద్యార్థులకు భారీగా ప్రయోజనం చేకూరిన మాట వాస్తవమే అయినా ఆ శకం ఇప్పుడు ముగిసిందని పేర్కొన్నారు.

### ఏఐ భర్తీ చేయలేని రంగాలు

'మనుషుల ప్రత్యక్ష అవసరం ఉండే, ఆటోమేషన్‌కు గురికావడానికి తక్కువ అవకాశం ఉన్న రంగాలపై యువత దృష్టి పెట్టాలి. భారతదేశంలో నిరుద్యోగిత, తక్కువ ఉపాధి సమస్యలను ఒకేసారి పరిష్కరించాలంటే శ్రమశక్తి ఆధారిత రంగాలను బలోపేతం చేయాలి' అన్నారు. ఉత్పాదక రంగంతో పాటు మానవ సంబంధాలు, సేవలతో ముడిపడి ఉన్న కొన్ని రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా భారీగా అవకాశాలు సృష్టించవచ్చని నాగేశ్వరన్ వెల్లడించారు.

# ఇక అణ్వాయుధాల జోలే లేదు.. నెతన్యాహు

**టెల్ అవీవ్:** ప్రస్తుతం పశ్చిమాసియాలో శాంతి పవనాలు వీస్తున్నాయి. అమెరికా,ఇరాన్‌ల మధ్య డీల్ కుదరడంతో ఇరు దేశాలు యుద్ధానికి ముగింపు పలికాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమిన్ నెతన్యాహూ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగే ఉండే అవకాశం లేదన్నారు. అది ఈ రోజైనా..రేపైనా అని స్పష్టం చేశారు. శాంతి ఒప్పందంపై ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో అసంతృప్తి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ ఆ దేశ ప్రజలకు వివరణ ఇచ్చారు. ఇరాన్‌పై యుద్ధం విషయంలో తాను చేసింది సరైందేనని సమర్థిస్తూ మాట్లాడారు. "మనం ఏమి సాధించామని ప్రజలు నన్ను అడుగుతున్నారు? దానికి నేను సమాధానమిస్తాను మనం ఏమి సాధించాం? మనపై ఉన్న తక్షణ వినాశన ముప్పును మనం తొలగించుకున్నాం. అన్నింటికన్నా ముఖ్యంగా, ఇజ్రాయెల్ రాజ్యాన్ని సంపూర్ణ వినాశనం ముప్పు నుండి కాపాడాం" అని అన్నారు. శత్రుదేశం ఇరాన్‌కు ఈ రోజే కాదు రేపు... ఎప్పుడూ అణ్వాయుధాలు ఉండవు. అని నెతన్యాహు పేర్కొన్నారు.తాము ఇజ్రాయెల్ దేశం చుట్టూ పటిష్టమైన భద్రతా వలయాలను ఏర్పాటు చేశామని. గాజా, లెబనాన్ మరియు సిరియాలలో కూడా మేము ఇదే చేశామని అన్నారు. తాను ఒక నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నానని ఇజ్రాయెల్‌కు అవసరమైనంత కాలం తమ భూభాగాన్ని రక్షించుకోవడానికి అవసరమైనంత కాలం మేము ఈ భద్రతా మండలాల్లోనే ఉంటామని నెతన్యాహూ తేల్చి చెప్పారు.



### ట్రంప్‌తో విభేదాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో గల విభేదాలపై స్పందించారు. కొన్నిసార్లు అధ్యక్షుడు ట్రంప్‌కు, నాకు మధ్య అభిప్రాయ భేదాలు ఉంటాయి. ఇజ్రాయెల్ భద్రతా ప్రయోజనాలను వివేకంతో కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అని అన్నారు.

### నెతన్యాహుపై విమర్శలు

ఇజ్రాయెల్‌లో నెతన్యాహు నాయకత్వాన్ని విమర్శిస్తూ విపక్ష నేత నఫ్తాలి బెన్నెట్ మాట్లాడారు. నెతన్యాహూ అధికారం అంతర్యుద్ధంతో ప్రారంభమై, అక్టోబర్ 7 నాటి మారణకాండతో కొనసాగి, ఇప్పుడు ఇరాన్‌పై చారిత్రాత్మక వైఫల్యంతో ముగుస్తోంది అని విమర్శించారు. ఈ వ్యతిరేకతల నేపథ్యంలో నెతన్యాహూ వివరణ ఇచ్చారు.

### ఎట్టకేలకు శాంతి ఒప్పందం

కాగా గత మూడు నెలలుగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు ఎట్టకేలకు ముగింపు లభించింది. హార్మూజ్ జలసంధి దిగ్బంధంతో నెలకొన్న అంతర్జాతీయ చమురు సంక్షోభానికి ముగింపు పలుకుతూ, యుద్ధజ్వాలలను ఆర్పేస్తూ అమెరికా, ఇరాన్ చారిత్రాత్మక శాంతి ఒప్పందం కోసం సమష్టిగా ముందుకొచ్చాయి. పరస్పర షరతులకు సమ్మతి తెలుపుతూ జూన్ 19వ తేదీన శాంతి ఒప్పందంపై సంతకాలు చేయబోతున్నట్లు అటు అమెరికా, ఇటు ఇరాన్ ప్రకటించాయి.

# ఒకే రోజు.. అమెరికా, రష్యాలకు భారీ షాక్!

**అవేం సాధారణ యుద్ధ విమానాలు కావు.. అవసరమైతే అణ్వాయుధాలను మోసుకెళ్లి వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై విరుచుకుపడగల గగన కోటలు. ఒకటి అమెరికా బీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్, మరొకటి రష్యా టీయూ-22ఎం3.. కోల్డ్‌వార్ కాలంలో ప్రపంచాన్ని గడగడలాడించిన రెండు మహాశక్తుల అణు బలానికి ప్రతీకలవి. అలాంటి రెండు దేశాల వ్యూహాత్మక శక్తికి ప్రతీకలైన బాంబర్లు.. కొన్ని గంటల వ్యవధిలో నేలకూలడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది..**

అమెరికా, రష్యాలకు ఒకే రోజు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం ఉన్న రెండు దేశాల వ్యూహాత్మక బాంబర్లు ప్రమాదానికి గురయ్యాయి. అమెరికాకు చెందిన బీ52 స్ట్రాటోఫోర్ట్రెస్ బాంబర్ కూలి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. రష్యాకు చెందిన టీయూ 22ఎం3 బాంబర్ కూడా కుప్పకూలింది. అయితే రష్యా విమానంలోని సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో పెను విషాదం తప్పింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అమెరికా వైమానిక దళానికి చెందిన బీ52 స్ట్రాటోఫోర్ట్రెస్ బాంబర్ కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే విమానం మంటల్లో చిక్కుకోవడంతో అందులో ఉన్న ఎనిమిది మంది సిబ్బంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ బాంబర్ టెస్టింగ్‌లో భాగంగా.. ప్రమాదానికి గురైనట్లు అమెరికా వైమానిక దళం తెలిపింది. ప్రమాదంలో సిబ్బంది సజీవ దహనం కాగా.. స్పాట్ నుంచి భారీగా నల్లటి పొగలు ఎగసిపడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు.. ఎడ్వర్డ్స్ ఎయిర్ బేస్‌లోని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు రష్యాలోని సైబీరియా ప్రాంతంలోని ఇర్కుట్‌స్క్‌లో టీయూ 22ఎం3 వ్యూహాత్మక బాంబర్ కూలిపోయింది. శిక్షణా విమానయానంలో పాల్గొంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే ప్రమాదం సంభవించే ముందే సిబ్బంది ఎజెక్ట్ కావడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. విమానం ఎలాంటి యుద్ధ సామగ్రి లేకుండానే ప్రయాణిస్తోందని, భూమిపై కూడా ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొంది.

అసలు ఈ రెండు వ్యూహాత్మక బాంబర్ల ప్రత్యేకతే వాటిని ప్రపంచ సైనిక చరిత్రలో అత్యంత కీలక వేదికలుగా నిలిపింది. బీ52 స్ట్రాటోఫోర్ట్రెస్ 1952లో తొలి ప్రయోగాన్ని పూర్తి చేసుకోగా, 1955లో అమెరికా వైమానిక దళంలో అధికారికంగా ప్రవేశించింది. దాదాపు ఏడు దశాబ్దాలుగా ఇది అమెరికా వ్యూహాత్మక వైమానిక శక్తికి వెన్నెముకగా కొనసాగుతోంది. వియత్నాం యుద్ధం, గల్ఫ్ యుద్ధం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ ఆపరేషన్లలో ఈ బాంబర్లు కీలక పాత్ర పోషించాయి. అణు బాంబుల నుంచి అత్యాధునిక క్రూయిజ్ క్షిపణుల వరకు మోసుకెళ్లగల సామర్థ్యం దీనికి ఉంది.దీని ప్రారంభ ఉత్పత్తి కాలంలో ఒక్క బీ52 విమానం ఖర్చు సుమారు 14 మిలియన్ డాలర్లకు చేరువగా ఉండేది. కానీ ఆధునికీకరణలు, అప్‌గ్రేడ్లు కలిపితే ప్రస్తుత విలువ మరియు నిర్వహణ వ్యయం వందల మిలియన్ డాలర్ల స్థాయికి చేరినట్లు రక్షణ విశ్లేషణలు పేర్కొంటాయి. ఇప్పటికీ కొత్త ఇంజిన్లు, అవియానిక్స్, ఆయుధ వ్యవస్థలతో దీన్ని నిరంతరం అప్‌గ్రేడ్ చేస్తూ వస్తున్నారు.

మరోవైపు రష్యా టీయూ22 బాంబర్ కుటుంబానికి చెందిన టీయూ22ఎం3 వెర్షన్ 1980లలో సేవల్లోకి వచ్చింది. నాటో దేశాలు దీనిని "బ్యాక్‌ఫైర్"గా పిలుస్తాయి. సోవియట్ యుగం నుంచి రష్యా వ్యూహాత్మక వైమానిక శక్తిలో ఇది కీలక భాగంగా కొనసాగుతోంది. సిరియా, ఉక్రెయిన్ యుద్ధాల్లో కూడా ఈ బాంబర్లను వినియోగించారు. ఖెచ్22 క్రూయిజ్ క్షిపణులు, అలాగే ఆధునిక హైపర్‌సోనిక్ ఆయుధాలు మోసుకెళ్లగల సామర్థ్యం దీని ప్రధాన బలం.టీయూ22ఎం3 ఖర్చు విషయానికి వస్తే, సోవియట్ కాల అంచనాలు మరియు ఆధునిక పునర్మూల్యాంకనాల ప్రకారం ఒక్క విమానం ఉత్పత్తి వ్యయం సుమారు 40-50 మిలియన్ డాలర్ల మధ్యగా భావించబడుతుంది. అయితే ఆయుధ సమీకరణ, నిర్వహణ, ఆధునికీకరణతో కలిపితే దీని మొత్తం జీవన వ్యయం గణనీయంగా పెరుగుతుంది. బలం విషయానికి వస్తే.. బీ52 విమానం దాదాపు 31 టన్నుల వరకు ఆయుధాలను మోసుకెళ్లగలదు. గాల్లో ఇంధనం నింపుకుంటే వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకుని దీర్ఘదూర దాడులు చేయగల సామర్థ్యం దీనికి ఉంది. మరోవైపు టీయూ22ఎం3 సూపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించగలదు. సముద్రంలోని యుద్ధ నౌకలు, భూభాగంలోని వ్యూహాత్మక స్థావరాలపై వేగవంతమైన దాడుల కోసం దీన్ని ప్రత్యేకంగా రూపొందించారు.ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. కోల్డ్‌వార్ ముగిసి మూడు దశాబ్దాలకు పైగా గడిచినా అమెరికా, రష్యా ఇప్పటికీ ఈ పాత తరం బాంబర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కొత్త వ్యూహాత్మక బాంబర్ల అభివృద్ధికి అయ్యే భారీ వ్యయం!. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, అణు జలాంతర్గాములు, హైపర్‌సోనిక్ ఆయుధాల అభివృద్ధితో బాంబర్ల ప్రాధాన్యం కొంత తగ్గినప్పటికీ.. అణు నిరోధక వ్యూహంలో వీటి పాత్ర మాత్రం ఇప్పటికీ కీలకంగానే ఉంది.అమెరికా ప్రస్తుతం అత్యాధునిక బీ21 రైడర్ స్టెల్త్ బాంబర్‌ను అభివృద్ధి చేస్తుండగా.. రష్యా పాక్‌డీఏ ప్రాజెక్టుపై పనిచేస్తోంది. అయితే సాంకేతిక సవాళ్లు, భారీ వ్యయభారం, పరీక్షల్లో జాప్యం కారణంగా ఈ ప్రాజెక్టులు ఇంకా పూర్తిస్థాయిలో సేవల్లోకి రాలేదు. ఫలితంగా 1950ల, 1980ల కాలానికి చెందిన ఈ గగన దిగ్గజాలే ఆధునికీకరణలతో ఇప్పటికీ సేవలు అందిస్తున్నాయి.





# బై బై చికాగో

హీరో, హీరోయిన్లు షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉంటారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఓ వైపు షూటింగ్స్, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉంటుంటారు. షూటింగ్స్‌కి ఏ మాత్రం విరామం దొరికినా చాలు సేద తీరేందుకు విదేశాల్లో వాలిపోతుంటారు. కుటుంబ సభ్యులతోనో, స్నేహితులనో వెకేషన్ ప్లాన్ చేస్తుంటారు. తమకు ఇష్టమైన ప్రదేశానికి వెళ్లి సరదాగా ఎంజాయ్ చేస్తుంటారు.

తమ అనుభూతులను, మధురమైన జ్ఞాపకాలను అభిమానుల కోసం సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా తాజాగా చికాగో వెకేషన్‌ని పూర్తి చేశారు. వరుణ్ ధావన్ హీరోగా మృణాళ్ ఠాకూర్, పూజా హెగ్డే హీరోయిన్లుగా డేవిడ్ ధావన్ తెరకెక్కించిన చిత్రం 'హై జవానీతో ఇష్క్ హోనా హై'. ఈ నెల 5న ఈ మూవీ విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా పాల్గొన్నారు మృణాళ్.

ఈ మూవీ రిలీజ్ తర్వాత వెకేషన్ కోసం చికాగో వెళ్లారామె. అక్కడ తనదైన శైలిలో సందడి చేసిన ఈ బ్యూటీ తిరిగి ఇండియాకి బయలుదేరారు. ఈ నేపథ్యంలో "బ్యాగులు మొత్తం సర్దేశాను.. చికాగో సిటీని వదిలే సమయం వచ్చింది. నిజం చెప్పా లంటే ప్రాణం పోతున్నట్టుగా ఉంది" అంటూ ఓ ఎమోషనల్ ఎమోజీతో పాటు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారామె. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను: సునీల్



''ఇసాకపట్నం' సిరీస్ చాలా వాస్తవంగా ఉంటుంది. ప్రతి పాత్రకు వారి సొంత లక్ష్యాలు, సంఘర్షణలు ఉంటాయి. ఈ సిరీస్‌లో నేను ఇప్పటి వరకు చేయని కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను'' అని సునీల్ పేర్కొన్నారు. ఐశ్వర్యా రాజేష్, సముద్రఖని ప్రధాన పాత్రల్లో, సునీల్, నరేష్ అగస్త్య, రాజీవ్ కనకాల, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమాకుల ఇతర పాత్రలు పోషించిన వెబ్ సిరీస్ 'ఇసాకపట్నం'. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. తమడా మీడియా ప్రొడక్షన్స్ పై రాహుల్ తమడా, సెదీప్ రెడ్డి బొర్రా నిర్మించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో తెలుగు ఒరిజినల్ వెబ్ సిరీస్‌గా రూ పొందిన ఈ సిరీస్ జూలై 2 నుంచి తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇసాకపట్నం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఐశ్వర్యా రాజేష్ మాట్లాడుతూ–''పవర్, సంఘర్షణతో నిండిన ప్రపంచంలో ధైర్యం, బలహీనత, ఆత్మవిశ్వాసంతో తనదైన నిర్ణయాలతో ముందుకు సాగే పాత్ర నాది.ఈ పాత్రను పోషించడం ప్రత్యేకమైన అనుభవం'' అని చెప్పా రు. ''ఇసాకపట్నం' ఒక కల్పిత ప్రపంచంలో సాగే కథ అయినప్పటికీ పాత్రలు, వారి భావోద్వేగాలు చాలా నిజాయితీగా ఉంటాయి'' అని గ్యారీ బీహెచ్ తెలిపారు. ''ఆశ, ప్రతీకారం, అధికారం కోసం మనుషులు ఎంత దూరమైనా వెళతారనే విషయాన్ని ఈ కథ బలంగా చెబుతుంది'' అన్నారు సముద్రఖని. నటులు నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్ మాట్లాడారు.

# కుబేర నటి బ్రేకప్.. ప్రియుడి ఫోటోలు డిలీట్





ప్రస్తుత రోజుల్లో డేటింగ్, బ్రేకప్స్ చాలా సర్వసాధారణమైపోయాయి. ఇది సినీ రంగంలో కాస్తా ఎక్కువే. తాజాగా మరో నటి బ్రేకప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ సునయన.. ఆ తర్వాత పలు సినిమాలు చేసింది. అయితే ఆమె తన ప్రియుడితో విడిపోయినట్లు సమాచారం. కాగా.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన కఖలిత్ అల్ అమెరికా అనే వ్యక్తి ప్రేమలో పడిన సునయన.. వీరి ప్రేమ వ్యవహారం నిశ్చితార్థం వరకు కూడా వెళ్లింది. తాజాగా వీరిద్దరి రిలేషన్‌కు ఎండ్ కార్డ్ పడినట్లేనని అర్థమవుతోంది. ఆమె తన ప్రియుడితో ఉన్న ఫోటోలను ఇన్‌స్టా నుంచి డిలీట్ చేసింది. దీంతో బ్రేకప్ వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే ఈ వ్యవహారంపై సునయన గానీ.. ఆమె ప్రియుడు గాని స్పందించకపోవడం గమనార్హం. కాగా.. నాగ్‌పూర్‌కు చెందిన సునయన ఎల్లా మోడల్‌గా తన కెరీర్ ప్రారంభించింది. 2005లో తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళం, కన్నడ చిత్రాల్లో అవకాశాలొచ్చాయి. అదేవిధంగా కాదలిల్ విళిందేన్ అనే చిత్రంతో తమిళంలోనూ అడుగుపెట్టింది. ధనుశ్, నాగార్జున నటించిన కుబేర మూవీలోనూ మెరిసింది. తమిళంలో మాసిలామణి ,వంశం, నీర్ పార్వైవ, సమర్ వంటి పలు చిత్రాల్లో నటించారు.



# డిసెంబరులో...

ప్రభాస్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ లవ్‌స్టోరీ మూవీ 'ఫౌజి'. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే ఈ సినిమా కథలో బ్రిటిష్ సోల్జర్ పాత్రలో ప్రభాస్ నటిస్తున్నారని తెలిసింది. ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'ఫౌజి' సినిమాను దసరా సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ ఇంకా పూర్తి కాని నేపథ్యంలో దసరాకు రిలీజ్ కావడం లేదని తెలిసింది. డిసెంబరు మొదటి వారంలో రిలీజ్ చేయాలని ప్రభాస్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంతేకాదు.. ఈ చిత్రంలో దేశభక్తి అంశాలు ఉండటంతో ఆగస్టు 15కి 'ఫౌజి' టీజర్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉందట.మరి.. 'ఫౌజి' డిసెంబరులోనే థియేటర్స్‌కు వస్తుందా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఇదిలా ఉంటే... ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' మూవీ చిత్రీకరణతో బిజీగా ఉన్నారని తెలిసింది. త్వరలోనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటారు. 'స్పిరిట్' సినిమా 2027 మార్చి 5న రిలీజ్ కానుంది. 'కల్కి 2' రిలీజ్ డేట్‌పై స్పష్టత రావడానికి మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

# మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీ.. క్యూ కడుతున్నారుగా..!



కోలీవుడ్ స్టార్స్ సినిమాలతో పాటు పాలిటిక్స్ వైపు దూసుకెళ్తున్నారు. తమిళనాట కొత్త పార్టీ పెట్టిన దళపతి విజయ్ ఎన్నికల్లో పోటీ చేసిన తొలిసారే సీఎం అయ్యారు. అదే స్ఫూర్తితో రాఘవ లారెన్స్ సైతం రాజకీయాల్లోకి వచ్చే అవకాశముందని క్లారిటీ ఇచ్చేశారు. ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్ కొనసాగించారు. విజయ్ పార్టీలో చేరతారా? లేదా అన్నదానిపై రాబోయే రోజుల్లో తెలియనుంది. ఇదిలా ఉండగానే మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. హీరోగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎదిగిన జీవీ ప్రకాశ్ కుమార్ రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చారు. సినీ ప్రయాణం ఇంకో 15 ఏళ్లు కొనసాగుతుందో లేదో చెప్పలేనని జీవీ ప్రకాశ్ అన్నారు. ఆ తర్వాత తాను ప్రజాసేవపైనే దృష్టి పెడతానని కీలక వ్యాఖ్యలు చేశారు. నా ఆలోచనలకు సరిపోయే వేదిక దొరికితే కలిసి పనిచేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ ప్రకటనతో భవిష్యత్తులో తాను రాజకీయాల్లోకి రావడం ఖాయమని హింట్ ఇచ్చారు జీవీ ప్రకాశ్. తాజా ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఇటీవలే రాఘవ లారన్స్, రజినీకాంత్ అల్లుడు లాంటి వాళ్లు రాజకీయాల్లోకి వస్తున్నారని వార్తలొచ్చాయి. లారెన్స్ ఇప్పటికే ఎంట్రీపై క్లారిటీ ఇచ్చాడు. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ సైతం తన పొలిటికల్ ఎంట్రీ సంకేతాలిచ్చారు. ఇదంతా చూస్తుంటే కోలీవుడ్ ఇండస్ట్రీ సినిమాల కంటే ఎక్కువగా రాజకీయాల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో సినీ ఇండస్ట్రీ.. తమిళనాట రాజకీయాలను శాసించనుందా? అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పెద్ది కొత్త వర్షన్.. థియేటర్లలో ఎప్పుడంటే?



రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తొలి రోజే పాజిటివ్ టాక్ అందుకున్న ఈ సినిమా రూ.400 కోట్ల మార్క్ దిశగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించింది. అయితే ఆమె రోల్ అచియ్యమ్మ పాత్రపై విమర్శలొచ్చాయి. జాన్వీ కపూర్ సీన్స్ అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. దీంతో జాన్వీ కపూర్‌పై సన్నివేశాలపై డైరెక్టర్ బుచ్చిబాబు క్షమాపణలు కూడా చెప్పారు. ఆ తర్వాత ఆ సీన్స్‌ను మూవీ నుంచి తొలగించారు. అయితే జాన్వీ కపూర్ సీన్స్ తొలగించిన పెద్ది మేకర్స్ మరి కొన్ని సన్నివేశాలను యాడ్ చేశారు. కొత్త వర్షన్‌లో జాన్వీ కపూర్ పాత్రపై రెండు సన్నివేశాలు, సీనియర్ నటుడు జగపతి బాబుకు సంబంధించిన ఓ సీన్ ఉంటుందని ప్రకటించారు. కొత్తగా సీన్స్ యాడ్ చేసి పెద్దిని థియేటర్లలో రన్ చేయనున్నారు. కొత్త సన్నివేశాలు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వస్తాయని మేకర్స్ ప్రకటించారు. సక్సెస్ మీట్‌లో బుచ్చిబాబు మాట్లాడుతూ.. "మేము ఇప్పటికే ఎడిటింగ్ పూర్తి చేశాం. ఈ బుధవారం నుంచి కొత్త సీన్స్ జోడిస్తాం. మేము మొత్తం మూడు సన్నివేశాలను చేర్చాం. హీరోయిన్‌కు సంబంధించిన సన్నివేశాలు.. అలాగే జగపతి బాబు కోసం ఓ సీన్ ఉంటుంది. ఈ సన్నివేశాలు అచియ్యమ్మ పాత్రకు మరింత భావోద్వేగ లోతును తీసుకొస్తాయి. జాన్వీ పాత్ర మరో స్థాయికి చేరుకుంటుందని నమ్ముతున్నా" అని బుచ్చి బాబు సానా అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com